మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

నేటి ఈవార్తలు
NETI EVARTHALU
దినపత్రిక

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

గురువారం THURSDAY 2-10-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00
సంపుటి: 1 Volume:1 | సంచిక: 94 Issue: 94

Published from Jagitial
www.evarthalu.com

పంచాంగం వివరాలు తెలుసుకోండి. 02 అక్టోబర్ 2025 - గురువారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - శరత్ ఋతువు ఆశ్వయుజ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:10 సూర్యాస్తమయం - సా. 6:00 తిథిః దశమి రా. 7:05 వరకు తరువాత ఏకాదశి సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం ఉత్తరాషాఢ ఉ. 9:03 వరకు తరువాత శ్రవణ యోగం సుకర్మ రా. 11:21 వరకు కరణం తైతుల ఉ. 7:11 వరకు గరజి రా. 7:05 వరకు వర్జ్యం మ. 1:17 నుండి మ. 2:54 వరకు దుర్ముహూర్తం ఉ. 10:07 నుండి ఉ. 10:54 వరకు మ. 2:51 నుండి మ. 3:38 వరకు రాహుకాలం మ. 1:34 నుండి మ. 3:03 వరకు యమగండం ఉ. 6:10 నుండి ఉ. 7:38 వరకు గుళికాకాలం ఉ. 9:07 నుండి ఉ. 10:36 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:34 నుండి తె. 5:22 వరకు అమృత ఘడియలు రా. 11:00 నుండి రా. 12:37 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:41 నుండి మ. 12:29 వరకు గమనిక: “౦” అనగా మరుసటి రోజున

# ఎట్టకేలకు మేడిగడ్డకు రిపేర్లు




## తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం.. అన్నారం, సుందిళ్లకు కూడా

### రిపేర్లు చేయొచ్చన్న ఎన్డీఎస్ఏ.. బరాజ్ మరమ్మతులకు టెండర్లు.. ఇరిగేషన్ అధికారులకు రేవంత్ ఆదేశం

**కాళేశ్వరం ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్లకు రిపేర్లు చేయాలని సంకల్పించింది. వాటి పునరుద్ధరణ కోసం ప్రభుత్వం టెండర్లు పిలిచింది. దీనికోసం ఈనెల 15 వరకు గడువు విధించింది. డిజైన్ల తయారీకి అంతర్జాతీయ సంస్థల నుంచి ఈవోఐ కోరుతూ జాతీయస్థాయిలో నోటిఫికేషన్ విడుదల చేసింది. దెబ్బతిన్న బరాజ్లను మరమ్మతు చేయాలని జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ తన రిపోర్టులో పేర్కొన్న విషయం తెలిసిందే. ఆ నివేదిక ఆధారంగానే పనులు మొదలుపెట్టాలని ప్రభుత్వం యోచిస్తోంది.**

హైదరాబాద్, అక్టోబర్ 1 (ఈవార్తలు: వరదల తర్వాత భౌతిక పరీక్షలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తోంది. అర్హత సాధించిన సంస్థలను సైతం ఈ పరీక్షల ప్రక్రియలో భాగస్వాములు చేయాలని యోచిస్తున్నట్లు సమాచారం. దీంతో ఎన్డీఎస్ఏ రికమండేషన్స్ ఆధారంగా వీలైనంత త్వరగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్లకు ప్రభుత్వం మరమ్మతు చేసేందుకు సిద్ధమైంది. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఇచ్చిన మధ్యంతర తరువాయి 2 వ పేజీలో...



# ఆరెస్సెస్ మర్రిచెట్టు

## సంఘ్‌ను అణచివేసేందుకు కుట్రలు.. అంతర్గత, బాహ్య సవాళ్లు ఎదుర్కొన్నాం

### దేశ ఐక్యతే ఆరెస్సెస్ ప్రధాన లక్ష్యం
### శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని మోదీ ఉద్ఘాటన
### ప్రత్యేక నాణెం, తపాలా బిళ్ల విడుదల
### తొలిసారి కరెన్సీపై భరతమాత చిత్రం




**స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌ను అణిచివేయడానికి ప్రయత్నాలు జరిగాయని, కానీ అది మర్రి చెట్టులా స్థిరంగా నిలిచిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. న్యూఢిల్లీలోని డాక్టర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగిన సంఘ్ శతాబ్ది ఉత్సవాలకు బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరైన ప్రత్యేక తపాలా బిళ్ళ, నాణేన్ని విడుదల చేశారు. కోవిడ్ మహమ్మారి సమయంలో స్వచ్ఛంద సేవకులు దేశానికి సహాయం చేశారని ప్రధాని మోదీ అన్నారు.**

న్యూఢిల్లీ: తపాలా బిళ్ళ, ప్రత్యేక నాణేన్ని విడుదల చేసిన ప్రధాని, రెండింటి ప్రత్యేకతలను వివరించారు. 100 రూపాయల నాణెంపై ఒక వైపు జాతీయ చిహ్నం, మరోవైపు సింహం, అంకితభావంతో పనిచేసే స్వచ్ఛంద సేవకులు ఆమెకు నమస్కరిస్తున్న భరతమాత చిత్రం ఉన్నాయని ఆయన తెలిపారు. భారత కరెన్సీపై భారతమాత చిత్రం ఉందని, బహుశా స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఇదే మొదటిసారి అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొసబాలే కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ నిర్వహించింది. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. ‘మన ఐక్యత, సమగ్రత, తరువాయి 2 వ పేజీలో...

# కేంద్ర ఉద్యోగులకు 3% డీఏ పెంపు

## 2025 జులై 1 నుంచే వర్తించనున్న కొత్త డీఏ
## మొత్తం డీఏ 55 58 శాతానికి పెరుగుదల
## లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు లబ్ధి
### త్వరలోనే కేంద్ర కేబినెట్ ఆమోదం

**దసరా పండుగ వేళ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త అందే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉద్యోగులకు చెల్లించే కరవు భత్యం (డీఏ)ను మరో మూడు శాతం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైనట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. దీనిపై కేంద్ర కేబినెట్ త్వరలోనే తుది నిర్ణయం తీసుకుని, అధికారిక ప్రకటన విడుదల చేయనుంది. ఈ పెంపునకు కేబినెట్ ఆమోదముద్ర వేస్తే, మొత్తం డీఏ 55 శాతం నుంచి 58 శాతానికి చేరుకుంటుంది. ఈ ఏడాది డీఏను పెంచడం ఇది రెండోసారి కావడం గమనార్హం.**



న్యూఢిల్లీ: మార్చి నెలలో ప్రభుత్వం ఇప్పటికే 2 శాతం డీఏను పెంచింది. తాజా పెంపు నిర్ణయాన్ని ఈ ఏడాది జులై 1 నుంచే వర్తింపజేయనున్నారు. దీంతో ఉద్యోగులకు మూడు నెలల బకాయిలు కూడా అందనున్నాయి. సాధారణంగా, వినియోగదారుల ధరల సూచీ (%జూ×%) ఆధారంగా ప్రభుత్వం ఏటా రెండు సార్లు డీఏను సవరిస్తుంటుంది. పెరుగుతున్న ద్రవ్యోల్బణం నుంచి ఉద్యోగులకు ఉపశమనం కల్పించేందుకు ఈ భత్యాన్ని తరువాయి 2 వ పేజీలో...



నేటి అవతారం:
శ్రీ రాజరాజేశ్వరి దేవి
– శ్రీ దుర్గ మల్లేశ్వరస్వామి దేవస్థానం, విజయవాడ



పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు దసరా పండుగ శుభాకాంక్షలు.


**నేడు సెలవు**

గురువారం మా కార్యాలయానికి సెలవు. కాబట్టి శుక్రవారం పత్రిక వెలువడదు. పునర్దర్శనం శనివారం.
– ఎడిటర్ & పబ్లిషర్

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.11,744 |
| వెండి (గ్రాము): | రూ.161 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,541 |

## విశ్వవాణి



ఒత్తిడిగా ఫీల్ అవుతున్నారా? వెంటనే ఒకసారి మీ అమ్మతో మాట్లాడండి. వీలు కాకపోతే ఫోన్ చేసి మాట్లాడండి. ఎందుకంటే.. ఒత్తిడికి గురవుతున్నప్పుడు అమ్మ మాట వింటే వెంటనే ఒత్తిడి నుంచి ఉపశమనం లభిస్తుందని తాజా అధ్యయనంలో తేలింది. అమ్మ మాట.. ఆలింగనంతో ఇచ్చే ఓదార్పుతో సమానం అని వెల్లడైంది.

IBOMMA

# ఖాకీ.. కాస్కో!

## మాతో పెట్టుకోవద్దు

### మీరు ఫోకస్ చేస్తే మేం ఫోకస్ చేస్తాం
### పోలీసులకు ఐ బొమ్మ వార్నింగ్

హైదరాబాద్, అక్టోబర్ 1 (ఈవార్తలు): ఐ బొమ్మ వెబ్‌సైట్‌పై ఫోకస్ చేశామని.. దాని వెనకున్న కేటుగాళ్లను త్వరలోనే పట్టుకుంటామని హైదరాబాద్ పోలీసులు తెలిపారు. అయితే తాజా గా ఈ ఘటనపై ఐ బొమ్మ వెబ్ సైట్ దీటుగా రిప్లై ఇచ్చింది. తమ వెబ్ సైట్‌లో



# రైతులకు ‘మద్దతు’

### రబీ ఎమ్మెస్పీ పెంచిన కేంద్ర ప్రభుత్వం
### దసరా వేళ మోదీ సర్కారు కానుక

న్యూఢిల్లీ: పండుగ వేళ రైతులకు కేంద్రం శుభవార్త చెప్పింది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో బుధవారం సమావేశమైన కేంద్ర కేబినెట్.. 1.20 లక్షల కోట్లు విలువైన కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. అందులో భాగంగా రబీ సీజన్ పంటలకు కనీస మద్దతు ధరను పెంచింది. దాంతో పాటు -2 వ పేజీలో...



# పీవోకేలో బుల్లెట్ నెత్తురు

### పౌరుల ఆందోళనపై పాక్ సైన్యం కాల్పులు.. బుధవారం 10 మంది కాల్చివేత

ముజఫరాబాద్: పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో నిరసనలు కొనసాగుతున్నాయి. ఆవామీ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గత మూడు రోజుల నంచి పౌరులు చేస్తున్న ఆందోళనను పాక్ బలగాలు అణచిసేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో నిరసనలు తరువాయి 2 వ పేజీలో...



# యూపీఐ లావాదేవీలపై చార్జీలు ఉండవు

### క్లారిటీ ఇచ్చిన ఆర్బీఐ గవర్నర్

న్యూఢిల్లీ: యూపీఐ లావాదేవీలపై ఎటువంటి ఛార్జీలు విధించే ఆలోచన లేదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా బుధవారం స్పష్టం చేశారు. ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ, యూపీఐ వేదికల ద్వారా జరిగే లావాదేవీలకు రుసుము వసూలు చేసే అంశాన్ని పరిశీలించడం లేదని, వినియోగదారులకు ఇది ఉచితంగానే కొనసాగుతుందని తెలిపారు. డిజిటల్ చెల్లింపులపై అదనపు ఛార్జీలు విధిస్తారనే సందేహాలను తరువాయి 2 వ పేజీలో...

# వడ్డీ రేట్లు యథాతథం

### ఆర్బీఐ కీలక నిర్ణయం

# తెలంగాణకు 4 కేంద్రీయ విద్యాలయాలు

## కొత్తగూడెం, ములుగు, జగిత్యాల, వనపర్తి జిల్లాల్లో ఏర్పాటు

### హర్షం వ్యక్తం చేసిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి.. మోదీ, ధర్మేంద్ర ప్రధాన్‌కు ధన్యవాదాలు



హైదరాబాద్, అక్టోబర్ 1 (ఈవార్తలు): కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు కొత్తగా మరో నాలుగు కేంద్రీయ విద్యాలయాలను కేటాయించిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే ఉన్న 35 కేంద్రీయ విద్యాలయాలకు తోడుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం (యాస్పిరేషనల్ డిస్ట్రిక్ట్), ములుగు జిల్లా తరువాయి 2 వ పేజీలో...



# మళ్లీ ప్రైవేట్ కాలేజీల బంద్..!?

## ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం సమ్మెబాట

### నిన్న కాలేజీల యాజమాన్యాల అత్యవసర భేటీ

హైదరాబాద్, అక్టోబర్ 1 (ఈవార్తలు): తెలంగాణలోని ప్రైవేటు కాలేజీలు ప్రభుత్వం ఫీజు రీఇంబర్స్‌మెంట్ డ్యూస్ ఇవ్వకపోవడంతో మళ్లీ మళ్లీ సమ్మెకు సిద్ధంగా అవుతున్నాయి. బుధవారం కాలేజీ మేనేజ్‌మెంట్లు ఒక ఎమర్జెన్సీ మీటింగ్ నిర్వహించి భవిష్యత్తు చర్యలపై చర్చించారు. ఆ సమావేశం ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్స్ ఆఫ్ తెలంగాణ హైయ్యర్ ఎడ్యుకేషన్స్ తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు
02.10.2025

మేషం: చేపట్టిన పనులు అప్రయత్నంగా పూర్తి చేస్తారు. ముఖ్యమైన వ్యవహారాలలో కుటుంబ సలహాలు తీసుకోని ముందుకు సాగడం మంచిది. అవసరానికి ధన సహాయం అందుతుంది. వ్యాపారాలు పురోగతికి చేసిన ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి ఉద్యోగమున సమస్యలను తెలివిగా పరిష్కరించుకుంటారు.

వృషభం: నిరుద్యోగులకు నూతన అవకాశములు అందుతాయి. నూతన వస్తు వాహన లాభాలున్నవి. చిన్ననాటి మిత్రులతో విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి ఉద్యోగాలలో చాలా కాలంగా వేధిస్తున్న సమస్యలు తొలగుతాయి. మానసికంగా ప్రశాంతత కలుగుతుంది.

మిధునం: చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. కుటుంబ పెద్దలతో మాట పట్టింపులుంటాయి. రుణ ఒత్తిడి పెరిగి వలన మానసికంగా స్థిమితం ఉండదు. వృధాప్రయాణాలు చెయ్యవలసి వస్తుంది. ఇంటాబయటా నూతన సమస్యలు కలుగుతాయి. వ్యాపారాలు నిలకడ రాణించవు. ఉద్యోగ వాతావరణం నిరాశ కలిగిస్తుంది.

కర్కాటకం: సన్నిహితులతో విభేదాలు కలుగుతాయి. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులుంటాయి. వ్యాపార విషయమై తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదు. దైవ సేవ కార్యక్రమాలలో పాల్గొంటారు. సన్నిహితులతో స్వల్ప ఇబ్బందులు తప్పవు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశములున్నవి.

సింహం: ఇంట బయట గౌరవ మర్యాదలు పొందుతారు. ఆర్ధిక వ్యవహారాలు సంతృప్తికరంగా సాగుతాయి. నూతన వ్యాపారాలకు కుటుంబ సభ్యుల నుండి పెట్టుబడులు అందుతాయి. సంతానం విద్యా ఉద్యోగ విషయాలలో శుభవార్తలు అందుతాయి. వృత్తి ఉద్యోగమున ఆశించిన పదవులను పొందుతారు.

కన్య: సంఘంలో ప్రముఖుల పరిచయాలు లాభిస్తాయి. ధన వ్యవహారాలలో అనుకూలత కలుగుతుంది. బంధు మిత్రుల నుండి శుభవార్తలు అందుతాయి. నూతన గృహ వాహన కొనుగోలుకు ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి వ్యాపారాల్లో కీలక నిర్ణయాలు చేసి లాభాలు పొందుతారు. ఉద్యోగమున అధికారుల ఆదరణ పొందుతారు.

తుల: ఆదాయానికి మించి ఖర్చులుంటాయి. దూర ప్రయాణాలలో వాహన ప్రమాద సూచనలున్నవి. చేపట్టిన పనులలో జాప్యం తప్పదు. కుటుంబ సభ్యుల ప్రవర్తన కొంత ఆందోళన కలిగిస్తుంది. వృత్తి వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. ఉద్యోగమున ఇతరుల నుండి విమర్శలు ఎదురవుతాయి.

వృశ్చికం: కీలక వ్యవహారాలలో తొందరపాటు వలన గందరగోళ పరిస్థితులుంటాయి. మిత్రుల నుండి ఊహించని ఋణ ఒత్తిడి కలుగుతుంది. ఆరోగ్య విషయాలలో అశ్రద్ధ చెయ్యడం మంచిది కాదు. వ్యాపార విషయాలలో భాగస్థులతో స్వల్ప వివాదాలు కలుగుతాయి. ఉద్యోగ ప్రయత్నాలు మందకొడిగా సాగుతాయి.

ధనస్సు: అవసరానికి కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు పొందుతారు. దూర ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. బంధు మిత్రుల నుండి వివాదాలకు సంభందించిన కీలక సమాచారం అందుతుంది. వ్యాపారమున సమస్యలను పరిష్కారమౌతాయి. ఉద్యోగస్తులకు శుభవార్తలు అందుతాయి.

మకరం: జీవిత భాగస్వామితో చిన్నపాటి వివాదాలు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలలో అధిక కష్టం తో స్వల్ప ఫలితం పొందుతారు. చేపట్టిన వ్యవహారాలు సకాలంలో పూర్తికాక చికాకులు పెరుగుతాయి. ఆదాయ మార్గాలు మందగిస్తాయి. వృత్తి ఉద్యోగమున స్థానచలన సూచనలు ఉన్నవి. దీర్ఘ కాలిక ఋణ ఒత్తిడి పెరుగుతుంది.

కుంభం: నూతన కార్యక్రమాలను ప్రారంభించి సకాలంలో పూర్తిచేస్తారు. ఆత్మీయులు తో శుభకార్యాలకు హాజరవుతారు. గృహ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. నూతన వస్త్ర ఆభరణాలు కొనుగోలు చేస్తారు. ఆర్థిక అభివృద్ధి కలుగుతుంది. వృత్తి ఉద్యోగాలలో అనుకూల వాతవరణం ఉంటుంది. నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

మీనం: ముఖ్యమైన పనులు వ్యయప్రయాసలతో కానీ పూర్తికావు. బంధువర్గంతో విభేదాలు తప్పవు. ఆలోచనలలో స్థిరత్వం లోపిస్తుంది. ఇంట బయట చికాకులు పెరుగుగుతాయి. వృత్తి వ్యాపారాలు మరింత మందకొడిగా సాగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు నిరాశ కలిగిస్తాయి. సంతాన విద్యా విషయాలపై దృష్టి సారిస్తారు.

# ఎట్టకేలకు మేడిగడ్డకు రిపేర్లు

మొదటి పేజీ తరువాయి

నివేదికలోనే రికమండేషన్స్ ఆధారంగానే ప్రభుత్వం రిపేర్ చేపట్టేందుకు కసరత్తు చేస్తున్నది. మరమ్మతుల కోసం ఎంత ఖర్చు అవుతుందో లెక్క కట్టాలని ఇరిగేషన్ శాఖ అధికారులను ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిసింది. ఎన్ డి ఎస్ ఏ రికమండేషన్స్ లో ఏమున్నాయి ? ఎవరెవరు ఏమేమి పనులు చేయాల్సి ఉంటుంది? దేనికి ఎంత ఖర్చు అవుతుంది ? అనే అంశాలపై రెండు, మూడు రోజుల్లో రిపోర్టు రెడీ చేసి ఇవ్వాలని నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. రిపేర్లకు అయ్యే ఖర్చు మొత్తం నిర్మాణ సంస్థతోనే పెట్టించాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. ఎవరి నిర్లక్ష్యంతో తప్పు జరిగినప్పటికీ ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు ప్రజల కోణంలో ఉంటాయే తప్ప, రాజకీయ అంశాలతో ముడిపడి ఉండవని, అధికారులు కూడా అదే ఆలోచనతో ముందుకు వెళ్లాలని సీఎం స్పష్టం చేసినట్లు సమాచారం. కాళేశ్వరం ప్రారంభించిన తర్వాత వచ్చిన మొదటి వరదకే మేడిగడ్డ ఏడో బ్లాక్‌లో సమస్యలు తలెత్తాయని ఎన్‌డీఎస్‌ఏ తెలిపింది. 2019లో డ్యామేజీ జరిగిందని నివేదికలో పేర్కొంది. వాటిని అప్పుడే గుర్తించి రిపేర్లు చేపట్టి ఉంటే మిగతా పిల్లర్లకు సమస్యలు వచ్చేవి కాదని స్పష్టం చేసింది. ఆ సమయంలో బరాజ్ డిఫెక్ట్ లయబిలిటీ కాలంలో ఉన్నందున పునరుద్ధరణ బాధ్యత నిర్మాణ సంస్థ తీసుకోవాల్సి ఉంటుంది. రిపేర్లకు సంబంధించిన ఖర్చులు అంశాన్ని కూడా ఎన్డీఎస్ ఏ కంటే ముందే రాష్ట్రం ప్రభుత్వం నిర్మాణ సంస్థతో చర్చించింది. అవసరమైన ఖర్చులు భరించాల్సి ఉంటుందని చెప్పగా అందుకు ఒప్పుకున్నట్లు సమాచారం. ఇప్పుడు ఎన్‌డీఎస్ ఏ రికమండేషన్స్ రావడంతో వాడికి తగ్గట్లుగా మరమ్మత్తులు చేపట్టనున్నారు. ఇందుకోసం ఎవరెవరు ఎక్కడ ఏమి పని చేయాలనే దానిపై రెండు మూడు రోజుల్లో క్లారిటీ రానుంది. ఎంత వరకు మరమ్మతులు చేయగలరు? చేసిన తర్వాత కూడా మళ్లీ సమస్యలు వచ్చే అవకాశం ఉంటే ఎలా ముందుకు వెళ్లాలి? అనే అంశాలపై ఇంజినీర్ల బృంధం ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది. ఒక్క బరాజ్ తర్వాత మరొక్కటి కాకుండా మూడింటిలో ఉన్న డ్యామేజీలకు ఒకేసారి రిపేర్లు మొదలుపెట్టాలని యోచిస్తున్నట్లు సమాచారం.

### తుమ్మిడిహట్టి కట్టి తీరుతామన్న ప్రభుత్వం

కాళేశ్వరం బరాజ్‌ల పునరుద్ధరణకు డిజైన్ కన్సల్టెంట్ ఎంపిక ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. అదే సమయంలో తుమ్మిడిహెట్టి వద్ద కూడా బరాజ్ నిర్మిస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. కాళేశ్వరం బరాజ్ల పునరుద్ధరణకు ఈవోఐ పిలవాలని నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జ గత నెల 19న ఉత్తర్వులు జారీ చేశారు. ఆ తర్వాత కేవలం రెండు వారాల్లోగా డిజైన్ కన్సల్టెంట్ ను ఎంపిక చేయాలని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అధికారులను ఆదేశించడంతో ఈ ప్రక్రియ మరింత వేగం పుంజుకుంది. డిజైన్ల కోసం ఆసక్తి పత్రాలు అక్టోబర్ 15 మధ్యాహ్నం మూడు గంటలలోపు సమర్పించాల్సి ఉంది. అదేవిధంగా అక్టోబర్ 15న సాయంత్రం 5 గంటలకు సీల్డ్ కవర్స్ ఓపెన్ చేయనున్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలంగాణ నీటిపారుదల వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచారు.

## ఖాకీ.. కాస్కో!

మొదటి పేజీ తరువాయి

ఒక ముఖ్యమైన నోటీసును రిలీజ్ చేసింది. 'ఐ బొమ్మ మీద మీరు ఫోకస్ చేస్తే మేము ఎక్కడ ఫోకస్ చేయాలో అక్కడ చేస్తాం' అని వార్నింగ్ ఇచ్చింది. 'ఐ బొమ్మ మీద మీరు ఫోకస్ చేస్తే మేము ఎక్కడ ఫోకస్ చేయాలో అక్కడ చేస్తాం. డిస్ట్రిబ్యూటర్స్ కి ప్రింట్స్ అమ్మిన తరువాత మీరు ఎం పట్టనట్టు కెమెరా ప్రింట్స్ తీసిన వాళ్ళ మీద కాకుండా మీ %ూు% రెవిన్యూ కోసం ఆలోచిస్తూ మా మీద ఫోకస్ పెట్టారు. హీరో లకు అంత రెమ్యూనిరేషన్ అవసరమా? అది మీ కొడుకు అయినా ఎవరు అయినా. సినిమా ఇండస్ట్రీ లో చాలా మంది వున్నారు, వాళ్ళు ఏం అయిపోతారు అని కబుర్లు చెప్పకండి. వాళ్ళకి మీరు ఇచ్చే అమౌంట్ ఏ కూలి పని చేసినా వస్తాయి. కానీ మీ హీరోకి హీరోయిన్ కి వస్తాయా? సినిమా బడ్జెట్‌లో ఎక్కువ శాతం రెమ్యూనరేషన్స్, విదేశాలలో షూటింగ్‌లకు, ట్రిప్స్‌కి ఖర్చుపెడుతున్నారు. ప్రొడక్షన్ బాయ్స్ నుంచి లైట్ బాయ్స్ వరకు ఎంత ఖర్చుపెడుతున్నారు? ఇండియాలో షూటింగ్ చేస్తే బడ్జెట్ తగ్గుతుంది కదా. అక్కడ వాళ్ళకి ఉపాధి కలుగుతుంది కదా. అనవసర బడ్జెట్ పెట్టి ఆ బడ్జెట్ రికవరీకి దానిని మా మీద రుద్ది ఎక్కువకు అమ్ముతున్నారు, డిస్ట్రిబ్యూటర్స్ అండ్ థియేటర్ ఓనర్స్ ఆ అమౌంట్‌ను కలెక్ట్ చేసుకోవటానికి టికెట్ అమౌంట్ పెంచుతున్నారు. చివరికి మధ్యతరగతివాడే బాధపడుతున్నాడు. మా వెబ్సైటు మీద ఫోకస్ చేయటం ఆపండి లేదంటే నేను మీ మీద ఫోకస్ చేయాల్సి వస్తుంది. ఫస్ట్ వేరే కెమెరా ప్రింట్స్ రిలీజ్ చేసే వెబ్సైట్లు మీద మీ ద్రుష్టి పెట్టండి. ఇబొమ్మ అన్నది సిగరెట్ నుంచి ఈ-సిగరెట్‌కు యూజర్స్‌ను మళ్లించే ప్రక్రియ. మీ యాక్షన్ కి నా రియాక్షన్ ఉంటుంది. ఈ మిడిల్ లో వేరే ఏ హీరో కూడా టార్గెట్ అవ్వటం ఇష్టం లేదు. మేము స్వతహాగా వెబ్‌సైట్ నుంచి తొలగిస్తున్నాం, ఇప్పుడు ఇమ్మీడియేట్ డిలీట్ చేస్తే మీకు బయపడి లేదా మీరు తీయించినట్టు వుంటది అందుకే ఈ పోస్ట్ చేసిన కొన్ని గంటల తరువాత తీసివేయాలని అనుకుంటున్నాం.

### లావాదేవీలపై చార్జీలు ఉండవు

మొదటి పేజీ తరువాయి

ఆయన నివృత్తి చేశారు. ప్రస్తుత విధానంలో యూపీఐ పూర్తిగా ఉచితంగానే ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వం, ఆర్బీఐ సంయుక్తం గా యూపీఐని 'జీరో కాస్ట్' ప్లాట్‌ఫామ్‌గా కొనసాగించాలనే వైఖరిని గవర్నర్ వ్యాఖ్యలు బలపరిచాయి. ప్రపంచంలోనే అతిపెద్ద రియల్ టైమ్ చెల్లింపుల మార్కెట్‌గా భారత్ స్థానం మరింత సుస్థిరమవుతోందని ఆయన పేర్కొన్నారు.

### కేంద్ర ఉద్యోగులకు 3% డీఏ పెంపు

మొదటి పేజీ తరువాయి

అందిస్తారు. తాజా పెంపు వల్ల లక్షలాది మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఆర్థికంగా లబ్ధి చేకూరనుంది. ఉదాహరణకు, రూ.60,000 ప్రాథమిక వేతనం (బేసిక్ పే) ఉన్న ఉద్యోగికి ప్రస్తుతం డీఏ రూపంలో రూ.33,000 అందుతుండగా, కొత్త పెంపు తర్వాత అది రూ.34,800కి పెరుగుతుంది. ఇదిలా ఉండగా, ఉద్యోగుల వేతన సవరణ కోసం ప్రభుత్వం 8వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేయనుంది. ఈ కమిషన్ సిఫార్సుల మేరకు భవిష్యత్తులో జీతాలు, ఇతర అలవెన్సులపై స్పష్టత రానుంది. 2026 జనవరి 1 నుంచి కొత్త వేతన సంఘం సిఫార్సులు అమల్లోకి వచ్చాక, ప్రస్తుత డీఏను బేసిక్ పేలో విలీనం చేసి సున్నాకు రీసెట్ చేసే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## వడ్డీ రేట్లు యథాతథం

### ఆర్బీఐ కీలక నిర్ణయం

న్యూఢిల్లీ: భారతీయ రిజర్వ్ బ్యాంక్ మరోసారి కీలక నిర్ణయం తీసుకుంది. మానిటరీ పాలసీ కమిటీ సమీక్ష సమావేశంలోని వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించేందుకు నిర్ణయించినట్లు తెలిపింది. రెపో రేటును మరోసారి యథాతథంగా కొనసాగిస్తున్నట్లు ఈ మేరకు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రకటించా రు. ఆర్‌బీఐ ఎంపీసీ సమావేశంలోని నిర్ణయాలపై మీడియాకు వెల్లడించారు. రెంపో రేటును 5.5 శాతం వద్దే కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆర్‌బీఐ ఎంపీసీ సమావేశంలోని కీలక నిర్ణయాలను తెలుసుకుందాం. ఈ ఆర్థిక సంవత్సరం 2025-26లో ఇది నాలుగో ద్వైమాసిక మానిటరీ పాలసీ కమిటీ సమావేశం. రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో ఈ భేటీ సెప్టెంబర్ 29వ తేదీన మొదలై అక్టోబర్ 1వ తేదీ వరకు జరిగింది. రెపో రేటును యథాతథంగా కొనసాగిస్తూ ఆర్‌బీఐ నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్ సమీక్షా సమావేశాల్లో 0.25 శాతం మేర వడ్డీ రేట్లను తగ్గించిన సంగతి తెలిసిందే. జూన్ నెలలో నిర్వహించిన సమావేశంలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు తగ్గించింది. మూడు వరుస సమావేశాల్లో మొత్తం 1 శాతం వడ్డీ తగ్గించింది. ఆ తర్వాత ట్రంప్ టారిఫ్ ప్రకటనలు, అంతర్జాతీయ అనిశ్చితుల నేపథ్యంలో ఆగస్టు నెలలో జరిగిన సమావేశంలో వడ్డీ రేట్లను 5.5 శాతం వద్దే యథాతథంగా ఉంచింది. ఇప్పుడు మరోసారి అదే వడ్డీ రేట్లను కొనసాగించాలని నిర్ణయించింది. ఇక ఈ ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధి అంచనాలను 6.5 శాతం నుంచి 6.8 శాతానికి పెంచింది. ఇక త్రైమాసికాల వారీగా చూసుకుంటే క్యూ2లో 6.7 శాతం నుంచి 7 శాతానికి పెంచింది. క్యూ3లో 6.6 శాతం నుంచి 6.4 శాతానికి తగ్గించింది. క్యూ4లో 6.3 శాతం నుంచి 6.2 శాతానికి తగ్గించింది.

## మళ్లీ ప్రైవేట్ కాలేజీల బంద్..!?

మొదటి పేజీ తరువాయి

చైర్మన్ రమేశ్ మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం ఫీజు డ్యూస్ ఇంకా విడుదల చేయలేదని, ప్రభుత్వం విద్యా రంగాన్ని చివరి ప్రాధాన్యత ఇస్తోంది అని ఆయన అన్నారు. 'డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గత నెల 21, 22 తారీఖుల్లో రూ.600 కోట్ల డ్యూస్ ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇప్పటివరకు రూ. 200 కోట్లు మాత్రమే వచ్చాయి. దీపావళి లోపు రూ. 1,200 కోట్లు ఇస్తామన్నారు. కానీ ఎట్లా ఇస్తారో చెప్పాలి' అని రమేశ్ అన్నారు. డ్యూస్ అక్టోబర్ 12వ తేదీలోగా చెల్లించకపోతే 13వ తేదీ నుంచి సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. ఇంకా ఈరోజు కేవలం సీఎం ఆఫీసుతోనే మాట్లాడుతామని చెప్పారు. అవసరమైతే విద్యార్థులతో కలిసి ఛలో హైదరాబాద్ చేస్తామని ప్రకటించారు. ఇంజనీరింగ్, ఫార్మసీ ప్రైవేటు కాలేజీలకు ప్రభుత్వం ఇంతకుముందు చాలా డ్యూస్ ఇవ్వాల్సి ఉంది. పండుగలకు ముందు రూ.1,200 కోట్ల డ్యూస్ విడుదల చేస్తామని ప్రభుత్వం మాట ఇచ్చింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి కాలేజీ మేనేజ్‌మెంట్‌తో ఇటీవల సమావేశమయ్యారు. కానీ హామీలకు తగ్గట్టుగా డ్యూస్ విడుదల కాలేదు. ఇదే డిమాండ్‌తో గత నెలలో ప్రైవేట్ కళాశాలల బంద్‌కు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. సెప్టెంబర్ 15న బంద్ విజయవంతమైంది. ఇప్పుడు మళ్లీ ప్రైవేట్ కళాశాలల బంద్ తప్పేలా లేదు. ఫీజ్ రీఇంబర్స్‌మెంట్‌పై ప్రస్తుత విధానం కాకుండా, కొత్త విధానం తీసుకురావాలన్న డిమాండ్ కూడా ఉంది. ఇంజనీరింగ్, ఫార్మసీ, లా, ఎంబీఏ, ఎంసీఏ లాంటి ప్రొఫెషనల్ కోర్సులు అందించే కాలేజీలు ఫీజు రీఇంబర్స్‌మెంట్ డ్యూస్ లేని కారణంగా ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

## రైతులకు 'మద్దతు'

మొదటి పేజీ తరువాయి

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ, డీఆర్‌ను పెంచింది. ఈ మంత్రివర్గ సమావేశంలో కేంద్రీయ విద్యాలయాల పెంపునకు కూడా ఆమోదం లభించింది. అస్సాంలోని కాలియాబోర్-నుమాలిగఢ్ హైవేతో పాటు ఫ్యూచరిస్టిక్ బయోమెడికల్ రీసెర్చ్ ప్రోగ్రాంకు కూడా ఆమెదం తెలిపింది మంత్రివర్గం. ఈ మేరకు కేబినెట్ నిర్ణయాలను కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. 2026-27 మార్కెటింగ్ సీజన్‌లో రబీ పంటల కనీస మద్దతు ధరను ప్రభుత్వం పెంచింది. దీని ద్వారా రైతులకు వారి ఉత్పత్తులకు తగిన ధరలు లభిస్తాయి. అత్యధికంగా కుసుమ పువ్వుకు క్వింటాలుకు రూ.600, కాయధాన్యాలు (లెంటిల్స్) (మసూర్) క్వింటాలుకు రూ.300 చొప్పున మద్దతు ధర పెంచారు. రాప్‌సీడ్ %డ% ఆవాలకు రూ.250, పప్పుధాన్యాలకు రూ.225, బార్లీకి రూ.170, గోధుమలకు రూ.160 చొప్పున పెంచారు. కేంద్ర మంత్రివర్గం పప్పుధాన్యాలలో ఆత్మనిర్భరతను సాధించడానికి ప్రత్యేక మిషన్‌ను ఆమోదించింది. ఈ మిషన్ ద్వారా దేశీయంగా పప్పు ధాన్యాల ఉత్పత్తిని పెంచడం, స్వయం సమృద్ధి సాధించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మిషన్ కోసం 2025-26 నుంచి 2030-31 వరకు.. ఆరేళ్ల కాలంలో, రూ.11,440 కోట్ల ఖర్చు చేస్తారు. మంత్రివర్గ సమావేశంలో బయోమెడికల్ రీసెర్చ్ కెరీర్ ప్రోగ్రామ్ మూడో దశను కొనసాగించేందుకు నిర్ణయం తీసుకున్నారు.

### తెలంగాణకు 4 కేంద్రీయ విద్యాలయాలు

మొదటి పేజీ తరువాయి

కేంద్రం (గిరిజన ప్రాంతం), జగిత్యాల జిల్లా - జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్, వనపర్తి జిల్లా - నాగవరం శివారులో ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ నాలుగు విద్యాలయాలు మారుమూల ప్రాంతాల్లో.. నాణ్యమైన ప్రాథమిక, సెకండరీ విద్యను అందించడంలో కీలకం కానున్నాయని కిషన్ రెడ్డి విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. తెలంగాణలో విద్యాభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ధన్యవాదాలు చెప్పారు. గత రెండేళ్లలోనే కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో నాణ్యమైన సెకండరీ విద్యను అందించేందుకు రూ.400 కోట్లతో 832 పీఎం-శ్రీ స్కూల్స్‌ను మంజూరు చేసిందని కిషన్ రెడ్డి తెలిపారు. దేశవ్యాప్తంగా పీఎం శ్రీ స్కూల్స్ కోసం ఎక్కువ కేటాయింపులు అందుకున్న రాష్ట్రం తెలంగాణనే కావడం విశేషమన్నారు.

## విద్య, ఉద్యోగవాణి

### హెడ్ కానిస్టేబుల్ ఉద్యోగాల నోటిఫికేషన్

మొత్తం పోస్టులు: 552
అర్హత: సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టులతో పది లేదా ఇంటర్ ఉత్తీర్ణులైన వారు
వయోపరిమితి: 18-27 ఏళ్ల మధ్య ఉండాలి
దరఖాస్తు చివరి తేదీ: అక్టోబర్ 20, 2025

### బీడీ స్కాలర్‌షిప్స్ దరఖాస్తు గడువు పెంపు

బీడీ కార్మికుల పిల్లల స్కాలర్‌షిప్స్ దరఖాస్తు గుడువును పొడిగించినట్లు బీడీ కార్మికుల దవాఖాన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఈ పథకానికి అర్హులన్నారు. సెలవుల నేపథ్యంలో సెప్టెంబర్ 30న ముగియాల్సిన గడువును అక్టోబర్ 15 వరకు పొడిగించారన్నారు. బీడీ కార్మికుల పిల్లలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

### టీజీ సెట్ 2025 నోటిఫికేషన్

తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ నోటిఫికేషన్ విడుదలైంది. ఉస్మానియానియా యూనివర్సిటీ డిసెంబర్ రెండో వారంలో కంప్యూటర్ బేస్ట్ టెస్ట్ విధానంలో ఈ పరీక్షను నిర్వహించనుంది. 100 మార్కులకు పేపర్-1, 200 మార్కులకు పేపర్-2 ఉంటుంది. అక్టోబర్ 10 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అసిస్టెంట్ ప్రొఫెసర్/లెక్చరర్ పోస్టులకు అర్హత కోసం ఈ పరీక్ష నిర్వహిస్తారు. వెబ్‌సైట్ http://telaganaset.org/

### ఆర్ఆర్ఆర్ అసిస్టెంట్ లోకో పైలట్ రిజల్ట్స్ రిలీజ్

అసిస్టెంట్ లోకో పైలట్ పోస్టులకు నిర్వహించిన కంప్యూటర్ బేస్ట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఫలితాలను రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ విడుదల చేసింది. ఇవాళ రాత్రి 7 గ్టల నుంచి స్కోర్ కార్డులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మొత్తం 9,970 అసిస్టెంట్ లోకో పైలట్ ఉద్యోగాలకు ఈ ఏడాది జులై 15 నుంచి ఆగస్టు 31 వరకు పరీక్షలు జరిగాయి.

# ఆరెస్సెస్ మర్రిచెట్టు

మొదటి పేజీ తరువాయి

భద్రతలను ధ్వంసం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. మనం అంతర్గత, బాహ్య సవాళ్ళను ఎదుర్కొంటున్నాం' అని ప్రధానమంత్రి చెప్పారు. 'జనాభా మార్పులు మనకు పెద్ద సవాలు. ఈ సవాలు పట్ల మనం చాలా జాగ్రత్తగా ఉండి, దానిని ఎదుర్కోవాలి. మొత్తం సమూహాన్ని కలిపి ఉంచడం ముఖ్యం' అని ఆయన అన్నారు. నేటి కాలపు సవాళ్లు, పోరాటాలు భిన్నమైనవని పేర్కొంటూ, 'ఇతర దేశాలపై ఆర్థికంగా ఆధారపడటం, మన ఐక్యతను విచ్ఛిన్నం చేసే కుట్రలు, జనాభా స్వభావాన్ని మార్చే కుట్రలు... ప్రధానమంత్రిగా, ఈ సమస్యలన్నింటినీ మా ప్రభుత్వం సమర్థవంతంగా పరిష్కరిస్తోందని నేను వినయంగా చెబుతున్నాను' అని మోదీ సంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో కూడా, చొరబాట్లు భారతదేశ జనాభా సమతుల్యతను మారుస్తున్నాయని, జాతీయ భద్రతకు తీవ్ర ముప్పు కలిగిస్తున్నాయని ప్రధాని గట్టి హెచ్చరిక చేశారు. 'ఒక ఆందోళన, ఒక సవాలు గురించి నేను దేశాన్ని అప్రమత్తం చేయాలనుకుంటున్నాను. బాగా ఆలోచించిన కుట్రతో, దేశ జనాభా స్వభావం మార్చబడుతోంది, కొత్త సంక్షోభ బీజాలు నాటబడుతున్నాయి. చొరబాటుదారులు నా దేశ యువత ఉపాధిని లాక్కుంటున్నారు. చొరబాటుదారులు నా దేశ సోదరీమణులు, కుమార్తెలను లక్ష్యంగా చేసుకుంటున్నారు.

### ఆరెస్సెస్ స్థాపన యాదృచ్ఛికం కాదు

భారతదేశ ఆర్థికంగా ఆధారపడటాన్ని తగ్గించడం గురించి, ముఖ్యంగా యునైటెడ్ స్టేట్స్ దేశంపై యాభై శాతం సుంకాలు విధించిన నేపథ్యంలో, మేక్ ఇన్ ఇండియా, స్వదేశీకి ప్రాధాన్యం ఇవ్వడం గురించి కూడా ఆయన మాట్లాడారు. వంద సంవత్సరాల క్రితం విజయదశమి రోజున ఆరెస్సెస్ స్థాపన జరిగింది. ఇది యాదృచ్ఛికం కాదు అని ప్రధాని మోదీ అన్నారు. మంచి చెడుపై, సత్యం అసత్యంపై, వెలుగు చీకటిపై విజయాన్ని ఈ పండుగ సూచిస్తుంది అని ఆయన ఆ ఉత్సవం ప్రాముఖ్యాన్ని వివరించారు.

'రేపు విజయదశమి, ఇది మంచి చెడుపై విజయాన్ని, న్యాయం అన్యాయంపై విజయాన్ని, సత్యం అసత్యంపై విజయాన్ని, వెలుగు చీకటిపై విజయాన్ని సూచించే పండుగ... నూరేళ్ళ క్రితం ఈ గొప్ప రోజున ఒక సంస్థగా ఆరెస్సెస్ స్థాపన జరిగింది. ఇది యాదృచ్ఛికం కాదు' అని పేర్కొన్నారు.

### పీవోకేలో బుల్లెట్ నెత్తురు

మొదటి పేజీ తరువాయి

ముజఫరాబాద్: పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో నిరసనలు కొనసాగుతున్నాయి. ఆవామీ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గత మూడు రోజుల నంచి పౌరులు చేస్తున్న ఆందోళనను పాక్ బలగాలు అణచివేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో నిరసనలు హింసాత్మకంగా మారాయి. బుధవారం పాక్ బలగాలు జరిపిన కాల్పుల్లో 10 మంది పౌరులు మృతిచెందారు. ధిర్కోట్, బాగ్ జిల్లాలో నలుగురు.. ముజఫరాబాద్, మిర్పూర్ ప్రాంతాల్లో ఇద్దరు చొప్పున మృతిచెందారు. మంగళవారం కూడా మరో ఇద్దరు చనిపోయారు. మరోవైపు, ఆందోళనలు అణగదొక్కడానికి పీఓకే పట్టణాలో పాక్ బలగాలు ఫ్లాగ్ మార్చ్‌లు చేస్తున్నాయి. ఈ ఆందోళనలతో పీఓకేలో మార్కెట్లు, దుకాణాలు, రవాణా ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. బుధవారం ఉదయం.. నిరసనకారులను అడ్డుకోవడానికి వంతెనలపై ఉంచిన పెద్ద పెద్ద కంటైనర్లపైకి ఆందోళనకారులు రాళ్లు రువ్వారు. అనంతరం వాటిని నదిలో పడగొట్టారు. ఈ క్రమంలోనే నిరసనకారులపైకి బలగాలు కాల్పులు జరిపాయి.

# ఏనాటికైనా ధర్మానిదే విజయం



### ఇదే దసరా అందించే స్ఫూర్తి: కేసీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 1 (ఈవార్తలు): రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఓటమి నుంచి రాష్ట్ర ప్రజల జీవితాలు గెలుపు దిశగా పయనించాలి అని కేసీఆర్ ఆకాంక్షించారు. తొమ్మిది రోజుల బతుకమ్మ సంబురాలతో పాటు, దేవీ శరన్నవరాత్రుల దుర్గమ్మ పూజల పర్వదినాలకు కొనసాగింపుగా.. విజయ దశమిగా జరుపుకునే దసరా పండుగకు తెలంగాణ ప్రజా జీవనంలో ప్రత్యేక స్థానం ఉన్నదని కేసీఆర్ అన్నారు. కార్యదీక్షులను అపజయాల నుంచి విజయాల దిశగా నడిపిస్తూ, ఏనాటికైనా ధర్మానిదే అసలు విజయం అనే స్ఫూర్తిని దసరా పండుగ మనకు అందిస్తుందని కేసీఆర్ తెలిపారు. దసరా పండుగ విశిష్టతను గౌరవిస్తూ, జమ్మి చెట్టును రాష్ట్ర వృక్షంగా, పాలపిట్టను రాష్ట్ర పక్షిగా, నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించిందని ఈ సందర్భంగా కేసీఆర్ గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో బతుకమ్మతో పాటు విజయ దశమి స్ఫూర్తి ఇమిడి ఉన్నదని, అదే స్ఫూర్తితో పదేండ్ల పాలనలో ప్రజలను ప్రగతి విజయాల దిశగా నడిపించామన్నారు. ఓటమి నుంచి రాష్ట్ర ప్రజల జీవితాలు గెలుపు దిశగా పయనించాలని కేసీఆర్ ఆకాంక్షించారు. తాము ఎంచుకున్న లక్ష్యాలను చేరుకుని, నిత్య శుభాలతో ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు నిండేలా దీవించాలని దుర్గా మాతను కేసీఆర్ ప్రార్థించారు.

# బీఆర్ఎస్‌తో నాకు సంబంధం లేదు: కవిత



హైదరాబాద్, అక్టోబర్ 1 (ఈవార్తలు): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రంగా ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసమే తమ పోరాటమని ఆమె స్పష్టం చేశారు. బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో ఈరోజు ఆమె మీడియాతో మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందే వరకు కేవలం రెండు నెలలు ఆగి ఎన్నికలు నిర్వహిస్తే ప్రభుత్వానికి వచ్చే నష్టమేంటని ఆమె ప్రశ్నించారు. ఒకవైపు జీవో ఇచ్చి, మరోవైపు తమ అనుచరులతోనే కోర్టులో కేసు వేయించారని, ఈ విషయం సోషల్ మీడియాలో కూడా చర్చనీయాంశమైందని ఆమె వ్యాఖ్యానించారు. గ్రామాల్లో లేని సామాజికవర్గాలకు కూడా రిజర్వేషన్లు కేటాయించడం గందరగోళానికి దారితీస్తోందని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన కులగణన వివరాలను బయటపెడితే రిజర్వేషన్ల కేటాయింపులో స్పష్టత వస్తుందని కవిత సూచించారు. ఇదే సమయంలో, స్థానిక ఎన్నికలపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలపైనా కవిత తీవ్రంగా స్పందించారు. న్యాయస్థానాలను తప్పుదోవ పట్టించేలా ఈటల మాట్లాడుతున్నారని, ఆయన వ్యాఖ్యలు సొంతమా లేక పార్టీవి చెప్పించారా అని నిలదీశారు. ఈ వ్యాఖ్యల పట్ల ఈటల రాజేందర్ బీసీ సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. మరోవైపు, రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహ రూపురేఖలను మార్చి గెజిట్ విడుదల చేసిందని ఆరోపించారు. అయితే, బతుకమ్మ నిమజ్జన కార్యక్రమంలో సీఎం పాల్గొనడాన్ని ఆమె స్వాగతించారు. ఈ సందర్భంగా, తనకు బీఆర్ఎస్ పార్టీతో ఎలాంటి సంబంధం లేదని కవిత స్పష్టం చేయడం గమనార్హం.

# కేసీఆర్ పాలన రైతులకు స్వర్ణయుగం: కేటీఆర్



హైదరాబాద్, అక్టోబర్ 1 (ఈవార్తలు): తెలంగాణలో 2014 నుంచి పదేళ్ల కాలంలో రైతుల బలవన్మరణాలు తగ్గాయన్న జాతీయ నేర గణాంక విభాగం నివేదికపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. తన అధికారిక సోషల్ మీడియా అకౌంట్ ఎక్స్ ద్వారా స్పందన తెలియజేశారు. కేసీఆర్ రైతుబంధు పాలన రైతులకు స్వర్ణయుగమనే విషయం మరోమారు రుజువైందని ఆయన పేర్కొన్నారు. అప్పటి ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, ప్రాజెక్టులవల్ల 2014 నుంచి 2023 మధ్య తెలంగాణలో రైతుల ఆత్మహత్యలు గణనీయంగా తగ్గాయని కేంద్ర ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయని తెలిపారు. 2014లో తెలంగాణలో రైతులు, కౌలుదారులు, రైతు కూలీల ఆత్మహత్యల సంఖ్య 1,347గా ఉన్నదని, అదే 2023లో ఆ ఆత్మహత్యల సంఖ్య 56కు తగ్గిందని కేటీఆర్ చెప్పారు. అంటే 96 శాతం తగ్గుదల నమోదైందని అన్నారు. దేశంలోని రైతుల ఆత్మహత్యల్లో తెలంగాణ వాటా 2014లో 10.9 శాతం ఉంటే.. 2023 నాటికి అది 0.51 శాతం తగ్గిందని తెలిపారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పరిస్థితి తారుమారైందని విమర్శించారు. రెండేళ్లలోనే 700 మందికిపైగా అన్నదాతల ఆత్మహత్యలు నమోదయ్యాయని ఆందోళన వ్యక్తంచేశారు.




# తెలంగాణ తల్లి ఫ్లైఓవర్ పేరు కనిపించకుండా స్టిక్కర్

### ఎందుకో క్లారిటీ ఇచ్చిన జీహెచ్ఎంసీ

హైదరాబాద్, అక్టోబర్ 1 (ఈవార్తలు): తెలంగాణ తల్లి ఫ్లైఓవర్ పేరులో ఎలాంటి మార్పు లేదని జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్స్ వింగ్ తెలిపింది. జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఇప్పటికే ఈ ఫ్లైఓవర్‌కు తెలంగాణ తల్లి ఫ్లైఓవర్‌గా నామకరణం చేస్తూ ఆమోదం తెలిపింది. ఫ్లై ఓవర్‌కు ఒకవైపు బోర్డ్ ఏర్పాటు పనులు పూర్తి అయ్యాయి. రెండోవైపు బోర్డు ఏర్పాటుకు ఫౌండేషన్ క్యూరింగ్ జరుగుతుంది. క్యూరింగ్ పీరియడ్ పూర్తి కాగానే రెండు రోజుల్లో రెండో సైడ్ బోర్డు ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. అప్పటి వరకూ ఇప్పటికే ఏర్పాటు చేసిన బోర్డును అందుకే కప్పి ఉంచామని జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్స్ వింగ్ స్పష్టతనిచ్చింది. రెండింటిని కలిపి ఒకేసారి ప్రారంభిస్తామని జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్స్ వింగ్ ప్రకటనలో స్పష్టం చేసింది. తెలంగాణ తల్లి ఫ్లైఓవర్‌గా పేరు మార్చాక బోర్డుపై పేరు కనిపించకుండా స్టిక్కర్ వేయడంతో గందరగోళం నెలకొంది. అందుకే ఈ విషయంలో స్పష్టత ఇస్తూ జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్స్ వింగ్ క్లారిటీ ఇచ్చింది. రెండో వైపు బోర్డు పనులు కూడా పూర్తయ్యాక.. రెండు బోర్డులను కలిపి ఒకేసారి ప్రారంభించే ఉద్దేశంతోనే కొత్త బోర్డుపై స్టిక్కర్ వేసినట్లు తెలిపింది. 2005 జనవరి 22న అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో నాటి ముఖ్యమంత్రి, దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి ఈ ఫ్లైఓవర్‌ను ప్రారంభించారు. అప్పట్లో 'తెలుగు తల్లి ఫ్లై ఓవర్' అని ఈ ఫ్లైఓవర్‌కు పేరు పెట్టారు. సుమారు ఇరవై ఏళ్ల తర్వాత స్వరాష్ట్రంలో 'తెలంగాణ తల్లి ఫ్లై ఓవర్'గా రేవంత్ సర్కార్ ఈ ఫ్లైఓవర్ పేరు మార్చడం గమనార్హం.

# గోధుమలకో నీతి.. వడ్లకో నీతా?

### బీజేపీ సర్కార్‌పై హరీశ్ ఫైర్



సిద్దిపేట, అక్టోబర్ 1 (ఈవార్తలు): దక్షిణ భారత దేశం అంటే కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి చిన్నచూపు అని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. గోధుమలకు మద్దతు ధర పెంచి, వడ్లకు పెంచలేదు. గోధుమలకో నీతి, వడ్లకో నీతి ఉంటుందా? అని నిప్పులు చెరిగారు. సిద్దిపేట బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం ఎప్పుడు దక్షిణ భారతదేశాన్ని చిన్నచూపు చూస్తున్నది. గోధుమల మద్దతు ధర పెంచారు సంతోషం. దక్షిణ భారతదేశంలో పండే వడ్లకు ఎందుకు మద్దతు ధర పెంచరు. క్వింటాల్ గోధుమలకు 160 మద్దతు ధర పెంచి రూ. 2585కు బిజెపి ప్రభుత్వం నిర్ణయించింది. వరి విషయంలో మాత్రం 69 రూపాయలు పెంచి రూ. 2369కు మాత్రమే నిర్ణయించారు. గోధుమలకు ఒక నీతి.. వరికో నీతి ఎందుకు? అని నిలదీశారు. ఉత్తర భారత దేశ రైతులకు ఒక నీతి దక్షిణ భారతదేశ రైతులకు ఒక నీతి. ఎందుకు దక్షిణ భారతదేశ రైతులంటే బిజెపికి చిన్న చూపు. గోధుమలతో సమానంగా వరికి మద్దతు ధర ఇవ్వాలని బిజెపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. తెలంగాణ నుండి ఇద్దరు కేంద్ర మంత్రులు, 8 మంది బీజేపీ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి వరికి మద్దతు ధర పెంచాలి. ఆరుగాలం కష్టపడే రైతు పట్ల ఎందుకు అంత వివక్ష. తెలంగాణలో మెజార్టీగా వరి పండుతుంది. దేశంలో అత్యధికంగా వరి పండిస్తున్న రాష్ట్రం తెలంగాణ. అతి ఎక్కువ నష్టం తెలంగాణకే జరుగుతున్నది. క్వింటాల్‌కు రూ. 220 నష్టం జరుగుతుంది. ఎకరానికి 30 క్వింటాల్స్ పండితే ఎకరానికి రూ. 7000లు తెలంగాణ రైతులు నష్టపోతున్నారు. గోధుమలకు ఇచ్చినట్టు వరికి కూడా మద్దతు ధర సమానంగా ఇస్తే తెలంగాణలో రైతులకు ఎకరానికి రూ. 7000లు లాభం జరుగుతుంది. తెలంగాణ బిజెపి ఎంపీలారా.. రైతుల పక్షాన నిలబడతారా? కేంద్రానికి కొమ్ము కాస్తారా? అని హరీశ్‌రావు నిలదీశారు.

# • డీజీపీగా శివధర్‌రెడ్డి బాధ్యతలు



రాష్ట్రానికి ఆరవ డీజీపీగా నియామకం

హైదరాబాద్, అక్టోబర్ 1 (ఈవార్తలు): నూతన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)గా సీనియర్ ఐపీఎస్ అధికారి శివధర్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రానికి ఆరవ డీజీపీగా నియమితులైన ఆయన, బుధవారం ఉదయం లక్డీకాపూల్‌లోని డీజీపీ కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముందు ఆయన కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, పండితుల నుంచి ఆశీర్వచనం తీసుకున్నారు. 1994 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన శివధర్ రెడ్డి, తొలుత ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌లో పనిచేశారు. 2014లో రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఆయన తెలంగాణ క్యాడర్‌కు మారారు. ఐపీఎస్ అధికారిగా శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పలు కీలక బాధ్యతలు నిర్వర్తించారు. 1996 నుంచి 2000 మధ్యకాలంలో విశాఖపట్నం జిల్లాలోని అనకాపల్లి, నర్సీపట్నం, చింతపల్లి సబ్ డివిజన్లలో ఏఎస్పీగా సేవలందించారు. ఆ తర్వాత, గ్రేహౌండ్స్‌లో అడిషనల్ ఎస్పీగా పనిచేశారు. ఆదిలాబాద్ జిల్లా బెల్లంపల్లిలో కూడా ఆయన విధులు నిర్వహించారు. ముఖ్యంగా ఉగ్రవాద కదలికలను గుర్తించడంలో, వామపక్ష తీవ్రవాదాన్ని అణచివేయడంలో శివధర్ రెడ్డి కీలక పాత్ర పోషించి మంచి గుర్తింపు పొందారు.

# 2028లో అధికారమే లక్ష్యం

## రామచందర్ రావు



కరీంనగర్, అక్టోబర్ 1 (ఈవార్తలు): 2028లో తెలంగాణలో అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఓట్లు అడిగే అర్హత లేదని ఆయన స్పష్టం చేశారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించడంతో పాటు, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లోనూ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆయన తీవ్రంగా విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం రూ. 40 వేల కోట్ల విలువైన ఎరువులను రాయితీపై అందిస్తోందని ఆయన గుర్తు చేశారు. ఎరువుల కొరతను అడ్డుకోలేని కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నిందను కేంద్రంపై నెట్టడం సరికాదని ఆయన అన్నారు. బీసీ రిజర్వేషన్లకు తాము కట్టుబడి ఉన్నామని ఆయన పునరుద్ఘాటించారు.

### భార్య తిండి పెట్టలేదని

# కరెంట్ స్తంభం ఎక్కిన భర్త

నిజామాబాద్ జిల్లాలో ఘటన

మద్యం మత్తులో హల్చల్ చేసిన వ్యక్తి

నిజామాబాద్, అక్టోబర్ 1 (ఈవార్తలు): నిజామాబాద్ జిల్లాలో ఓ విచిత్ర సంఘటన చోటుచేసుకుంది. భార్య మీద అలిగిన ఓ భర్త, ఏకంగా కరెంట్ స్తంభం ఎక్కి హల్చల్ చేశాడు. సుమారు రెండు గంటల పాటు స్థానికులను, పోలీసులను ముప్పుతిప్పలు పెట్టాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన సిరికొండ మండలంలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే, సిరికొండ మండలం కోమన్ పల్లి గ్రామానికి చెందిన సుమన్ అనే వ్యక్తికి, అతని భార్యకు మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో భార్య అతనికి భోజనం పెట్టేందుకు నిరాకరించింది. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన సుమన్, మద్యం సేవించి గ్రామ శివార్లలోని ఓ విద్యుత్ స్తంభం ఎక్కాడు. ఇది గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమై విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. స్తంభంపైకి ఎక్కిన సుమన్ కిందకు దిగేందుకు నిరాకరించాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఎంత బతిమాలినా వినలేదు. పైకి రావడానికి ప్రయత్నిస్తే దూకేస్తానని బెదిరించడంతో అంతా ఆందోళనకు గురయ్యారు. దాదాపు రెండు గంటల పాటు ఈ హైడ్రామా కొనసాగింది. పరిస్థితి చేయిదాటిపోతుండటంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. చివరకు పోలీసులు రంగప్రవేశం చేసి, అతనికి నచ్చజెప్పి సురక్షితంగా కిందకు దించారు. దీంతో అతని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.

# లిక్కర్ డీసీఎంలో మంటలు

### మద్యం బాటిళ్ల కోసం ఎగబడిన ప్రజలు

హబ్సిగూడ/హైదరాబాద్, అక్టోబర్ 1 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలోని హబ్సిగూడలో మద్యం లోడుతో వెళ్తున్న డీసీఎం వాహనంలో అగ్నిప్రమాదం సంభవించింది. వాహనంలో మంటలు చెలరేగడంతో అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే వాహనాన్ని నిలిపివేశాడు. స్థానికుల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో పలు మద్యం సీసాలు పాక్షికంగా కాలిపోయాయి. మద్యం సీసాలు చెల్లాచెదురుగా పడిపోవడంతో, వాటిని తీసుకునేందుకు స్థానికులు ఎగబడ్డారు. మద్యం సీసాలు పడిపోయిన విషయం తెలుసుకున్న చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు సంఘటన స్థలానికి పరుగులు తీశారు. ఈ సంఘటనతో అక్కడ గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

# కిడ్నీ వైఫల్యంతో ఆరుగురు పిల్లలు మృతి

### 2 దగ్గు సిరప్‌లపై నిషేధం

భోపాల్: కిడ్నీ వైఫల్యం వల్ల 15 రోజుల్లో ఆరుగురు పిల్లలు మరణించారు. ఆ చిన్నారులు వినియోగించిన రెండు రకాల దగ్గు సిరప్‌లు విషపూరితమైనట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో అధికార యంత్రాంగం వాటిని నిషేధించింది. మధ్యప్రదేశ్‌లోని చింద్వారా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. పరాసియా, న్యూటన్ చిక్లి, సమీప గ్రామాలకు చెందిన ఐదేళ్ల లోపు పిల్లలు జ్వరం, జలుబు, దగ్గు బారిన పడ్డారు. స్థానిక డాక్టర్లు జ్వరం మందులతోపాటు దగ్గు సిరప్‌లు రాశారు. వాటిని వాడిన పిల్లలు కొద్దిగా కోలుకున్నారు. ఆ తర్వాత వారిలో కిడ్నీ సమస్యలు తలెత్తాయి. కాగా, మెరుగైన చికిత్స కోసం కొందరు పిల్లలను మహారాష్ట్రలోని నాగ్‌పూర్ హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ముగ్గురు చిన్నారులు మరణించారు. సెప్టెంబర్ 7 నుంచి 20 వరకు 15 రోజుల్లో మూత్రపిండాల ఇన్ఫెక్షన్ కారణంగా ఆరుగురు పిల్లలు చనిపోయారు. కిడ్నీ బయాప్సీలో షాకింగ్ విషయం బయటపడింది. ఔషధ విష ప్రయోగానికి సంబంధించిన విషపూరిత రసాయనం డైథిలిన్ గ్లైకాల్ కారణంగా చిన్నారుల కిడ్నీలు పాడైనట్లు నిర్ధారణ అయ్యింది. మరోవైపు బాధిత చిన్నారులు ఎక్కువగా కోల్డ్‌రిఫ్, నెక్స్ట్రో-డీఎస్ దగ్గు సిరప్‌లు వినియోగించినట్లు అధికారుల దర్యాప్తులో తెలిసింది. దీంతో చింద్వారా కలెక్టర్ శీలేంద్ర సింగ్ అప్రమత్తమయ్యారు. ఆ రెండు రకాల దగ్గు సిరప్‌ల అమ్మకాలను జిల్లా అంతటా నిషేధించారు. డాక్టర్లు, మందుల షాపులతో పాటు ప్రజలను అలెర్ట్ చేశారు. ప్రభావిత గ్రామాల నీటి నమూనాలలో ఎలాంటి ఇన్ఫెక్షన్ కనిపించలేదని కలెక్టర్ తెలిపారు. చిన్నారుల మూత్రపిండాల వైఫల్యానికి కలుషిత ఔషధం కారణమన్నది బయాప్సీ నివేదిక బలంగా సూచిందని వెల్లడించారు. కాగా, మరింత మంది చిన్నారులు కిడ్నీ సమస్యల బారిన పడటంతో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) బృందాన్ని జిల్లా యంత్రాంగం పిలిపించింది. భోపాల్ ఆరోగ్య శాఖకు చెందిన ఇద్దరు సభ్యుల బృందం కూడా పరాసియా, న్యూటన్ చిక్లి, సమీప గ్రామాలను సందర్శించారు. బాధిత కుటుంబాల నుంచి వివరాలు సేకరించారు. దగ్గు మందు, ఇతర ఔషధ నమూనాలను సేకరించారు. మరోవైపు ప్రభావిత పిల్లలను గుర్తించేందుకు వైద్య అధికారులు ఆయా గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. పిల్లల రక్తం, ఔషధ నమూనాలను పూణేలోని వైరాలజీ ఇన్‌స్టిట్యూట్‌కు ఐసీఎంఆర్ బృందం పంపింది. కాగా, తమకు న్యాయం చేయాలని పిల్లలను కోల్పోయిన బాధిత కుటుంబాలు డిమాండ్ చేస్తున్నాయి.



# అక్టోబర్‌లోనూ భారీ వర్షాలు

## వెల్లడించిన భారత వాతావరణశాఖ

న్యూఢిల్లీ: వర్షాకాలం సీజన్ మంగళవారంతో ముగిసింది. ఈ సమయంలో దేశవ్యాప్తంగా సాధారణం కంటే ఎనిమిది శాతం ఎక్కువ వర్షాపాతం నమోదైందని భారత వాతావరణశాఖ చీఫ్ మృత్యుంజయ్ మోహాపాత్ర వెల్లడించారు. రుతుపవనాల సీజన్‌లో మంచి వర్షాలు కురిశాయని.. భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడడం సహా అనేక విపత్కర ఘటనలు చోటు చేసుకున్నాయన్నారు. దేశవ్యాప్తంగా నాలుగు నెలల కాలంలో సాధారణ వర్షాపాతం 868.6 మిల్లీమీటర్లతో పోలిస్తే 937.2 మిల్లీమీటర్ల వర్షాపాతం నమోదైందన్నారు. సాధారణం కంటే 8శాతం ఎక్కువగా ఉందన్నారు. నైరుతి రుతుపవనాల తిరోగమనం తర్వాత అక్టోబర్ మాసంలో భారత్‌లో సాధారణం కంటే 15శాతం ఎక్కువ వర్షాపాతం నమోదవుతుందని వాతావరణశాఖ అంచనా వేసింది. అక్టోబర్‌లో ఈశాన్య, వాయువ్య భారత్‌లోని చాలా ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రత సాధారణం కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మోహాపాత్ర పేర్కొన్నారు. అయితే, మిగతా ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రత సాధారణం కంటే తక్కువగా, సాధారణం కంటే ఎక్కువగా ఉంటుందని చెప్పారు. అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు కొనసాగే ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువగానే వర్షపాతం నమోదవుతుందని చెప్పారు. అయితే, వాయువ్య భారత్‌లోని కొన్ని ప్రాంతాలలో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా, సాధారణంగా ఉండే అవకాశం ఉందన్నారు. ఇదిలా ఉండగా.. రుతుపవనాల సీజన్‌లో తూర్పు, ఈశాన్య భారత్‌లో 1089.9 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇది సాధారణ వర్షపాతం 1367.3 మి.మీ కంటే 20 శాతం తక్కువ. బీహార్, అరుణాచల్ ప్రదేశ్, అసోం, మేఘాలయలో ఈ సీజన్‌లోని నాలుగు నెలల్లో మూడు నెలలు తక్కువ వర్షాపాతం నమోదైందని ఐఎండీ డీజీ తెలిపారు. తూర్పు-ఈశాన్య భారతంలో 1901 తర్వాత రెండోసారి అత్యల్ప వర్షపాతం నమోదైందన్నారు. ఈ ప్రాంతంలో రుతుపవనాల సమయంలో అత్యల్ప వర్షపాతం (1065.7 మి.మీ) 2013లో నమోదైంది. ఇటీవల కాలంలో తూర్పు, ఈశాన్య భారత్‌లో చాలా సంవత్సరాలుగా తక్కువ వర్షపాతం నమోదవుతోందని చెప్పారు. 2020 నుంచి ఈ ప్రాంతంలో తక్కువ వర్షపాతం నమోదైందని.. గత 20 ఏళ్లలో తూర్పు-ఈశాన్య భారత్‌లో వర్షపాతం తగ్గిందని కూడా అధ్యయనాలు చూపిస్తున్నాయి. వాయవ్య భారత్‌లో 747.9 మి.మీ వర్షపాతం నమోదైందని, ఇది సాధారణ వర్షపాతం (587.6 మి.మీ) కంటే 27.3 శాతం ఎక్కువ అని మోహాపాత్ర వెల్లడించారు. 2001 తర్వాత ఇదే అత్యధిక వర్షపాతమని.. 1901 తర్వాత ఆరవ అత్యధిక వర్షపాతమని వెల్లడించారు. మధ్య భారతంలో 1125.3 మి.మీ వర్షపాతం నమోదైందని, ఇది సాధారణం 978 మి.మీ కంటే 15.1 శాతం ఎక్కువని చెప్పారు. దక్షిణ ద్వీపకల్పంలో సాధారణం 716.2 మి.మీ కంటే 9.9 శాతం ఎక్కువ వర్షాలు కురిశాయన్నారు. వాయువ్యంలోని కొన్ని ప్రాంతాలు మినహా భారతదేశంలోని చాలా ప్రాంతాలలో అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఆయన తెలిపారు. అక్టోబర్‌లో భారత్‌లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, ఇది దీర్ఘకాలిక సగటు 75.4 మి.మీ కంటే 115 శాతం ఎక్కువగా ఉంటుందన్నారు. భారత వాతావరణ విభాగం అంచనా ప్రకారం.. అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు దక్షిణ భారతంలోని పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తాయి. తమిళనాడు, కోస్తాంధ్ర, రాయలసీమ, కేరళ, దక్షిణ ఇంటీరియర్ కర్నాటకలో ఈశాన్య రుతుపవనాల సమయంలో వర్షపాతం సాధారణం కంటే ఎక్కువగా (112శాతం కంటే ఎక్కువ) ఉండే అవకాశం ఉన్నది. 1971 నుంచి 2020 డేటా ప్రకారం.. దక్షిణ ద్వీపకల్ప భారతంలో ఈ సీజన్‌లో సాధారణ దీర్ఘకాలిక సగటు వర్షపాతం 334.13 మి.మీ. దేశవ్యాప్తంగా అక్టోబర్ నెలలో సగటు సాధారణ వర్షపాతం 75.4 మి.మీ., ఈసారి వర్షపాతం 115శాతం కంటే ఎక్కువగా ఉంటుందని అంచనా. బంగాళాఖాతం, అరేబియా సముద్రంలో అల్పపీడనాల అభివృద్ధి.. అలాగే కాలానుగుణ హెచ్చుతగ్గుల కారణంగా





## జేపీఎల్ విజేతగా స్ట్రీట్ బాయ్స్ టీం

జగిత్యాల టౌన్, అక్టోబర్ 1 (ఈవార్తలు): జగిత్యాల ప్రీమియర్ లీగ్ (జేపీఎల్) విజేతగా స్ట్రీట్ బాయ్స్ జట్టు నిలిచింది. జగిత్యాల జిల్లా కేంద్రంలోని వివేకానంద మినీ స్టేడియంలో ఈ నె 21న జేపీఎల్ ప్రారంభం కాగా, 8 జట్లు పోటీ పడ్డాయి. ఇందులో స్ట్రీట్ బాయ్స్, దర్బర్ అకాడమీ జట్టు ఫైనల్ చేరాయి. బుధవారం ఫైనల్ మ్యాచ్ జరగ్గా, స్ట్రీట్ బాయ్స్ జట్టు విజేతగా నిలిచింది. మ్యాచ్ అనంతరం జేపీఎల్ ట్రోఫీని కేఎల్ సంస్థల అధినేత కొండ లక్ష్మణ్ విజేతలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత సరైన మార్గంలో పయనించాలని ఆకాంక్షించారు. యువత ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేసి సమాజ అభివృద్ధికి తోడ్పాటునందించాలని సూచించారు.

## తెలంగాణకు కేంద్రం దసరా కానుక

### ప్రధాని మోదీకి కృతజ్ఞతలు: భోగ శ్రావణి



జగిత్యాల టౌన్, అక్టోబర్ 1 (ఈవార్తలు): కేంద్రంలోని మోదీ సర్కారు తెలంగాణలో పాఠశాల విద్య అభివృద్ధికి గొప్ప కృషి చేస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ భోగ శ్రావణి అన్నారు. జగిత్యాల జిల్లాలోని చల్‌గల్‌లో కేంద్రియ విద్యాలయ ఏర్పాటుకు కేంద్రం ముందుకు రావటంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుధవారం మీడియాతో మాట్లాడిన ఆమె.. జిల్లాకు కేంద్రియ విద్యాలయాన్ని అందించినందుకు ప్రధాని మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, నిజామాబాద్ ఎంపీ అర్వింద్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## విజయదశమి అందరికీ విజయం చేకూర్చాలి

### జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్



జగిత్యాల టౌన్, అక్టోబర్ 1 (ఈవార్తలు): విజయదశమి ప్రతి ఒక్కరికి విజయాన్ని చేకూర్చాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆకాంక్షించారు. దసరా పండుగ నేపథ్యంలో జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన.. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే ఈ పండగ ప్రతి ఇంటా ఆనందోత్సాహాలను నింపాలని అన్నారు. సంకల్పం గొప్పదైతే విజయం తప్పక సిద్ధిస్తుందనే భావనతో, దుర్గాదేవి కృపతో అందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, సిరిసంపదలతో జీవించాలని పేర్కొన్నారు.



## ఎస్పీ ఆఫీస్‌లో ఆయుధ పూజ

### పాల్గొన్న ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల టౌన్, అక్టోబర్ 1 (ఈవార్తలు): విజయదశమి పండుగ ప్రజలకు అన్ని రంగాలలో విజయం చేకూర్చాలని ఎస్పీ అశోక్ కుమార్ ఆకాంక్షించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో ఆయుధ పూజ, వాహన పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గా దేవికి ఎస్పీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయదశమి పర్వదినం అందరికీ సుఖ సంతోషాలను కలిగించాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు, పోలీస్ అధికారులకు, సిబ్బందికి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు వెంకటరమణ, రఘుచందర్, రాములు, వెంకటరమణ, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు కిరణ్ కుమార్, వేణు, సైదులు, ఇన్స్పెక్టర్లు శ్రీనివాస్, ఆరిఫ్ అలీ ఖాన్, రఫీక్ ఖాన్, శ్రీధర్, ఎస్సైలు పాల్గొన్నారు.

# 4,71,574 ఉద్యోగాలిచ్చాం

విజయనగరం, అక్టోబర్ 1 (ఈవార్తలు): ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా తమ ప్రభుత్వం ప్రజలకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని, మానవతా దృక్పథంతో సంక్షేమ పాలన అందిస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. విజయనగరం జిల్లా దత్తి గ్రామంలో నిర్వహించిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని, లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రతి నెలా ఒక గ్రామానికి నేరుగా వచ్చి పింఛన్ల పంపిణీని పర్యవేక్షిస్తున్నానని, అందులో భాగంగానే దత్తి గ్రామానికి వచ్చానని చంద్రబాబు తెలిపారు. దేశంలోని 29 రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్ వంటి పెద్ద రాష్ట్రంలో కేవలం రూ.500 మాత్రమే పింఛను ఇస్తున్నారని, కానీ ఏపీలో మాత్రం తాము అత్యధికంగా అందిస్తున్నామని పోల్చి చెప్పారు. రాష్ట్రంలో ప్రతి వంద మందిలో 13 మందికి పింఛను అందుతోందని, అందులో 59 శాతం మహిళలేనని వివరించారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన "సూపర్ సిక్స్" పథకాలను సూపర్ హిట్ చేశామని, అన్ని హామీలను అమలు చేస్తున్నామని ఆయన అన్నారు. మహిళల కష్టాలు తీర్చేందుకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. "స్త్రీ శక్తి" పథకం కింద ఆగస్టు 15న ప్రారంభించిన ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కేవలం 45 రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా 10 కోట్ల మంది మహిళలు వినియోగించుకున్నారని తెలిపారు. డ్వాక్రా సంఘాలను తీసుకొచ్చిందే తెలుగుదేశం ప్రభుత్వమని గుర్తుచేశారు. రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని చంద్రబాబు అన్నారు. ఇప్పటికే రైతు భరోసా కింద ప్రతి రైతుకు రూ.6,000 జమ చేశామని, త్వరలోనే మరో రూ.14,000 అందిస్తామని హామీ ఇచ్చారు. యువతకు ఉద్యోగాలు కల్పించే బాధ్యత తనదని చెబుతూ, ఏడాదిలోనే మెగా డీఎస్సీ నిర్వహించామన్నారు. ఈ 15 నెలల్లో 4,71,574 మందికి ఉద్యోగాలిచ్చామని తెలిపారు. రాష్ట్రానికి ఇప్పటికే రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, వీటి ద్వారా 9 లక్షల ఉద్యోగాలు వస్తాయని సీఎం ధీమా వ్యక్తం చేశారు.




# జైల్లో నన్ను టెర్రరిస్టులా చూశారు

### టీడీపీది పైశాచిక ఆనందం: మిథున్ రెడ్డి

తిరుపతి, అక్టోబర్ 1 (ఈవార్తలు): తెలుగుదేశం ప్రభుత్వంపై వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి తీవ్రమైన ఆరోపణలు చేశారు. తనను జైలులో ఒక టెర్రరిస్టు మాదిరిగా చూశారని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇటీవలే బెయిల్‌పై విడుదలైన ఆయన, తిరుపతిలో మీడియాతో మాట్లాడుతూ తన అరెస్టు, జైలు జీవితం గురించి అనేక విషయాలను వెల్లడించారు. టీడీపీ ప్రభుత్వం కేవలం పైశాచిక ఆనందం కోసమే తనను అక్రమ కేసులతో వేధిస్తోందని ఆయన ఆరోపించారు. "నన్ను 73 రోజుల పాటు జైల్లో ఉంచారు. ఆ సమయంలో నన్ను ఎవరితోనూ మాట్లాడనివ్వలేదు. సీసీ కెమెరాలతో నిరంతరం నిఘా పెట్టారు. విజయవాడ నుంచి నేరుగా పర్యవేక్షించారు. కనీసం జైలు అధికారులు కూడా నాతో మాట్లాడటానికి భయపడ్డారు. ఒక ఉగ్రవాదిని చూసినట్టుగా నన్ను ట్రీట్ చేశారు" అని మిథున్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు ఆదేశాలు ఇచ్చేంత వరకు తనకు కనీస వసతులు కూడా కల్పించలేదని, తనను కలవడానికి వచ్చిన వారిపై కూడా నిఘా పెట్టారని ఆయన వివరించారు. ఇది ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమేనని అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన ప్రతీసారి తనను ఇలాగే ఇబ్బందులకు గురిచేస్తోందని, 2014-2019 మధ్య కాలంలో కూడా తనపై అక్రమ కేసులు పెట్టారని గుర్తుచేశారు. ప్రభుత్వం చేయాల్సిన పనులను పక్కనపెట్టి, ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇలాంటి డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ కేసుల ద్వారా తన తల్లిదండ్రులను మానసిక వేదనకు గురిచేశారని అన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా తాను వెనక్కి తగ్గేది లేదని మిథున్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ అక్రమ కేసులకు తాను భయపడనని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని అన్నారు. కష్టకాలంలో తనకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌కు, మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.





# తీరం వైపు వస్తున్న వాయుగుండం

### ఏపీ, తెలంగాణకు భారీ వర్ష సూచన

వైజాగ్, అక్టోబర్ 1 (ఈవార్తలు): తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ కీలక హెచ్చరిక జారీ చేసింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం కారణంగా రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రకటించింది. ఈ నేపథ్యంలో నేడు కోస్తాంధ్ర, తెలంగాణ ప్రాంతాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ప్రస్తుతం బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడనం వేగంగా బలపడుతోందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇది పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ రేపు తెల్లవారుజాము నాటికి వాయుగుండంగా మారే అవకాశం ఉంది. ఆ తర్వాత కూడా ఇదే దిశలో ప్రయాణించి, 3వ తేదీన దక్షిణ ఒడిశా - ఉత్తర కోస్తాంధ్ర మధ్య తీరాన్ని దాటవచ్చని అధికారులు చెబుతున్నారు. ఈ వాయుగుండం ప్రభావంతో గురు, శుక్రవారాల్లో తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు వివరించారు. దీనికి తోడు రాగల మూడు రోజుల పాటు తీరం వెంబడి గంటకు 30 కిలోమీటర్లకు పైగా వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని హెచ్చరించారు. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని సూచించారు. వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.



# అస్వస్థతకు గురైన ఖర్గే.. గుండెకు పేస్‌మేకర్

బెంగళూరు: ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే మంగళవారం రాత్రి బెంగళూరులోని ఎంఎస్ రామయ్య ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే. శ్వాస సంబంధ సమస్యలు, జ్వరంతో బాధపడుతున్న ఆయనకు గుండె వేగం తగ్గకుండా ఉండేందుకు పేస్‌మేకర్‌ను అమర్చాలని వైద్యులు సూచించినట్లు ఆయన కుమారుడు ప్రియాంక్ ఖర్గే వెల్లడించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు. రేపు ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేసే అవకాశం ఉందన్నారు. మంగళవారం పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొన్న ఆయన.. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల నష్టంపై సమీక్ష నిర్వహించారు. వరద బాధితులకు పరిహారం కోసం ప్రధానికి లేఖ రాస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. దీంతో అప్రమత్తమైన సిబ్బంది ఆయనను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం జనరల్ వార్డులో విశ్రాంతి తీసుకుంటున్న ఖర్గేను సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లు పరామర్శించారు.



## జగిత్యాల జిల్లావ్యాప్తంగా పోలీస్ యాక్ట్: ఎస్పీ

జగిత్యాల టౌన్, అక్టోబర్ 1 (ఈవార్తలు): జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని నెల రోజుల (అక్టోబర్ 1వ తేదీ నుంచి 31 వరకు) పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని అన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని హెచ్చరించారు. జిల్లా ప్రజలు పోలీసులకు సహకరించి, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు.



## రాంరెడ్డి దామోదర్ రెడ్డి కన్నుమూత

### అనారోగ్యంతో ఏఐజీ దవాఖానలో తుదిశ్వాస

### 4న తుంగతుర్తిలో మాజీ మంత్రి అంత్యక్రియలు

హైదరాబాద్, అక్టోబర్ 1 (ఈవార్తలు): మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి (73) అనారోగ్యంతో కన్నుమూశారు. బుధవారం రాత్రి ఏఐజీ ఆసుపత్రిలో ఆయన తుది శ్వాస విడిచారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న దామోదర్ రెడ్డికి ఏఐజీలో చికిత్స అందించారు. చికిత్స పొందుతూ ఆయన బుధవారం రాత్రి చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. అక్టోబర్ 4, 2025న సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో దామోదర్ రెడ్డి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. ఖమ్మం జిల్లా లింగాలలో 1952 సెప్టెంబర్ 14న రాంరెడ్డి దామోదర్ రెడ్డి జన్మించారు. రాంరెడ్డి దామోదర్ రెడ్డి మొత్తం ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఐదు సార్లు ఎమ్మెల్యేగా, ఓసారి మంత్రిగా పనిచేశారు. ఉమ్మడి ఏపీకి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో ఐటీ శాఖ మంత్రిగా దామోదర్ రెడ్డి సేవలందించారు. తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాల నుంచి దామోదర్ రెడ్డి.. శాసన సభ్యుడిగా ఎన్నికయ్యారు. తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఐదు సార్లు రాంరెడ్డి దామోదర్ రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2009లో సూర్యాపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు.




- దత్తాత్రేయ శాస్త్రి,
ఆధ్యాత్మిక వేత్త

జ్ఞానం వచ్చిన నాటి నుండీ ప్రతి సంవత్సరం దసరా నాడు ఈ శ్లోకం వింటూనే ఉన్నాం. తులసిని రోజూ పూజించాలని, రావి ని సంవత్సరంలో అప్పుడప్పుడైనా పూజించాలని, ఆరోగ్య సమస్యలొచ్చినప్పుడు దాని చుట్టూ ప్రదక్షిణలు చేయాలని, ఉసిరిని కార్తీక దామోదరుని రూపమని, ఆ మాసంలో (ఆ ఋతువులో) తప్పక పూజించాలని, ఇంకా పంచ పల్లవాలని ప్రఖ్యాతి చేసిన మజ్జి, మామిడి, మేడి, రావి, జువ్వి (మమామేరాజు)లను వాటి సమిధలతో యజ్ఞయాగాలు చేయాలని ఏర్పరిచిన సంప్రదాయములలో మానవాళి జీవితాలకు ఎంతో శాస్త్రీయమైన ప్రయోజనం వుందని ఆధునిక వృక్ష జీవ శాస్త్రజ్ఞులు కూడా అంగీకరించారు.

**అయితే ఈ దసరా పండుగ రోజు ప్రత్యేకంగా జమ్మి చెట్టును మాత్రమే ఎందుకు పూజించాలి అనడంలో పాండవుల అజ్ఞాతవాసం కథ, శ్రీరాముడి కథ చెప్పుకోవడం లో ఏదో అంతరార్థం వుంది అనిపిస్తుంది. మౌలికంగా యుద్ధాలు చేయడానికి బయలుదేరడానికి, ఆయుధ పూజలకు ఈ పండుగను అన్వయం చేయడం సబబు అనిపించడం లేదు. మన పండుగలు, సంప్రదాయాలు మానవ జీవితానికి, ప్రకృతికి మధ్య సమన్వయం చేసుకోవడానికే కానీ.. మానవుల మధ్య యుద్ధాల గురించి, అందులో కోరుకునే విజయం గురించి కాదనిపిస్తుంది.**

ఏ ఇతర పండుగల మూలభావనలలోను ఇలాంటి ఉద్దేశ్యం లేదు. వాస్తవానికి ఈ పండుగ నాటికి వర్షాలు తగ్గి భూమి గట్టిపడుతూ వుంటుంది. వర్షాకాలం లో ఎక్కడివారక్కడ వుండి ఈ పండుగ నాడు 'సీమోల్లంఘనం' చేసి, అంటే తమ ప్రాంతపు సరిహద్దులు దాటి ఇతర ప్రాంతాలకు వెళ్లడం ఆరంభించడం జరిగేది. ఆ నాటి నుండి తమ నిత్యజీవితములో ఉపయోగించే వివిధ సాధనములను (ఆయుధములను) నవీకరించుకోవడమే 'ఆయుధ పూజ'గా చేసుకుంటారు. ఈ 'శమీ శమయతే పాపం' శ్లోకం, మనకు మళ్ళీ దసరా నాడే గుర్తుకొస్తుంది. సంవత్సరంలోని 364 రోజులూ గుర్తుకు రాని, సాధారణ నిత్య నైమిత్తికములలో భాగం కాని ఈ వృక్షమును సంవత్సరానికి ఒక పూట మాత్రం పూజించడంలో శాస్త్రీయత ఏమిటి? అంటే.. ప్రకృతిలో పంచ పల్లవాల మాదిరిగా సాధారణంగా వాడుకలో వుండే వృక్షం కూడా కాదు. ఒకవిధంగా విజయదశమి అన్నప్పుడే గుర్తుకు వచ్చే వృక్షమిది. మన పూర్వీకులు అర్ధరహితంగా ఏదీ ఒక సంప్రదాయముగా నిర్ణయించలేదు. ప్రతి ఆచారము లేదా సంప్రదాయము సామాజిక లేదా వ్యక్తిగత జీవితం భద్రముగా, సౌకర్యవంతముగా వుండడానికి, ఐహిక, ఆముష్మిక ఆత్మోన్నతి పొందటానికే నిర్ధారించారు. ఈ దృక్కోణముతో కొంచెం లోతుగా ఆలోచించినప్పుడు ఈ చెట్టు పూజకు మూలభావన ఏమై వుంటుందని మీలో కూడా ఆలోచన కలిగించడానికి ప్రయత్నం చేయాల్సిన అవసరం ఉంది.

# జమ్మి చెట్టును ఎందుకు పూజించాలంటే..



వినాయక చవితి రోజు పూజ చేసుకునే 'ఏకవింశతి పత్రి' లో ఈ ఆకు 12 వది. జమ్మి చెట్టు ఎలాంటి వాతావరణంలోనైనా సరే సులువుగా పెరుగుతుంది. నీటి లభ్యత లేకున్నా కూడా ఎక్కువకాలం బతుకుతుంది. ఈ జమ్మి చెట్టు నుంచి రాలిపోయే ఆకులు రాలుతుంటే కొత్త ఆకులు వస్తూనే ఉంటాయి. పూర్తిగా ఆకులు రాలి చెట్టు బోసిపోయినట్లు ఎప్పుడూ కనిపించదు. ఇప్పటి యువతకు, నగరవాసులకు ఈ చెట్టు ఉపయోగాల గురించి పెద్దగా తెలియకపోవచ్చు. కానీ గ్రామీణ జీవితంలో జమ్మి చెట్టుకు ఎంతో అనుబంధం ఉంటుంది. ఈ చెట్టు వేళ్లు భూసారాన్ని పెంచుతాయి. జమ్మి చెట్టులోని ప్రతి భాగం నాటు వైద్యంలో ఔషధంగా ఉపయోగపడుతుంది. ఈ చెట్టు గాలి పీలిస్తే ఆరోగ్యంగా ఉంటారని నమ్ముతారు. అందుకే శమీ వృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేయాలని చెబుతుంటారు. ఇన్ని ప్రత్యేకతలు ఉన్నాయి కాబట్టే దసరా నాడు రైతులు కూడా తమ పశుపక్ష్యాదుల ఆరోగ్యం కోసం జమ్మి చెట్టును పూజిస్తారు. సుగంధభరితంగా లేదా దుర్వాసనతో కూడి ఉన్న జమ్మి ఆకుల ఉల్లేఖన ఆయుర్వేదంలో ఉంది. కుష్టు రోగ నివారణకు, అవాంఛిత రోమాల నివారణకు జమ్మి ఆకులను ఉపయోగిస్తారు. జమ్మి ఆకుల నుండి పసరు తీసి దానిని పుళ్ళు ఉన్న చోట రాస్తే కుష్టువ్యాధి నశిస్తుంది. రోగాల నివారణకు ఉపయోగపడుతుంది.



**శమీ స్తోత్ర శ్లోకములు:**

అమంగలానాం శమనీమ్, శమనీమ్ దుష్కృతస్యచ
దుఃఖ ప్రణాశినీమ్, ధన్యాం ప్రపద్యేహం శమీమ్ శుభామ్!!
శమీ శమయతే పాపం శమీ లోహిత కంటకా
ధరిత్ర్యర్జున బాణానామ్ రామస్య ప్రియవాదినీమ్



**కరిష్యమాణ యాత్రాయాం యథా కాలం సుఖం మయా**
**శత్రు నిర్విఘ్న కర్త్రీమ్ త్వం భవ శ్రీరామ పూజితే !!**
**శమీ శమయతే పాపం శమీశత్రు వినాశినీ**
**అర్జునస్య ధనుర్ధారీ రామస్య ప్రియదర్శినీ**

శ్రద్ధగా గమనిస్తే పైశ్లోకములలో ఒక వృక్షాన్ని సంబోధిస్తున్నట్టు కాకుండా ఆ వృక్ష లక్షణాలు వర్ణిస్తున్నట్టుగా వున్నది. అందుకే శమ, శమీ శమనము లాంటి పదాల గురించి ఆలోచించి "శమ" అనే పదం కేంద్రముగా వీటి అంతరార్థం తెలుసుకోవడానికి ప్రయత్నించాల్సి ఉంది. నిత్యజీవితంలో "పాపము శమించుగాక", 'ఉపశమనము' వంటి పదములు మనం ఉపయోగిస్తాం. శమ అనేది ఇందులో ముఖ్యమైనదని తెలుస్తుంది కూడా. ఉపనిషత్తుల సారమైన శ్రీమత్ భగవద్గీత లో 18వ అధ్యాయములో 42 వ శ్లోకము.. "శమో దమస్తపః శౌచమ్ క్షాన్తిరార్జవమేవచ జ్ఞానం విజ్ఞాన మాస్తిక్యం బ్రహ్మకర్మ స్వభావజమ్". ఈ శ్లోకంలో శమము మొదలుగా 9 కర్మలు బ్రహ్మ కర్మలుగా భగవానుడు వివరించాడు. శంకరులు వివేకచూడామణిలో వివేకము, వైరాగ్యము శమాది షట్క సంపత్తి ముముక్షుత్వ అనేవి సాధనా చతుష్టయం అని వివరించారు. ఇందులో శమ, దమ, ఉపరతి, తితిక్ష, శ్రద్ధ, సమాధాన అనే ఆరు గుణముల సంపద ముముక్షువు కు ఒక సాధన అని విశదమవుతుంది.

అంటే..
'శమ' పాపమును శమింప చేస్తుంది
'శమ' శత్రువులు లేకుండా చేస్తుంది
'శమ' అర్జునుడి ధనస్సును ధరించింది

– అంటే గీతోపదేశ ప్రభావంతో అర్జునుడి గాండీవాన్ని కురుక్షేత్రములోని శత్రువులపై ఉపయోగించడానికి స్ఫూర్తి అయింది. 'శమ' ను శ్రీరాముడు ఎప్పుడూ ప్రియముగా చూసే వాడు (శరణాగతి గురించి రామాయణంలోనే ఎక్కువగా వివరించబడింది – ఎంతటి శత్రువునైనా క్షమించే గుణం రాముడిది) శమీ పూజ అంటే ఒక చెట్టు పూజ కాదని, మానవుడు ముముక్షుత్వము కొరకు చేయవలసింది అని తెలిసి పోతుంది. మరి విజయ దశమి నాడే ఎందుకు చేయాలి? అంటే.. దేవీ నవరాత్రులలో 'శక్తి'ని ఆరాధించిన భక్తుడు అత్యంత శక్తిమంతుడైనప్పుడు తాను అవలంబించవలసినది ముందుగా శమమే అవుతుంది. అది సాధిస్తేనే విజయం (మోక్షం) వరిస్తుంది. జమ్మిచెట్టు పూజ లో ఎంత తత్వముందో సాధారణ తర్కమునకు అందదు. ఇందులో అర్జునుడిని, శ్రీ రాముడిని మాత్రమే ఉటంకించారు. ఒక్క జమ్మిచెట్టు గురించి చెప్పాలనుకుంటే పాండవులందరి ఆయుధములను ధరించినది అని చెప్పాలి. ఈ భావన తో శమీ స్తోత్ర శ్లోకముల అర్థం అన్వయం చేసుకుంటే చాలా వరకు సరిపోతుంది. శమా గుణము గీతోపదేశము పొందిన అర్జునుడి ధనుస్సును మహాసంగ్రామంలో ఎలా ఉపయోగించడమో నిర్దేశించినది, శ్రీ రాముడు ప్రియంగా ఆచరించినది అనడం అర్థవంతమవుతుంది. శమాగుణము జీవుడిని ఉద్ధరించి చివరికి విజయుడిని చేస్తుంది. ఎంతో మంది యోధులున్నా విజయుడు అని పిలువబడినవాడు అర్జునుడొక్కడే.

## జమ్మి చెట్టు ప్రత్యేకత

మరి జమ్మి చెట్టు సంగతి ఎందుకు అని అనుకున్నపుడు ఈ చెట్టు గురించి ప్రాచీన శాస్త్రజ్ఞులు చేసిన పరిశోధనలు, పొందిన ఫలితాలు గమనించాలి. శమీ వృక్షం లేదా జమ్మి చెట్టు (లాటిన్) ఫాబేసి కుటుంబానికి చెందినది. ఈ చెట్టు యొక్క శాస్త్రీయ నామం ప్రోసోపిస్ సైసిజెరా. వైదిక భాషలో శమీ వృక్షాన్ని 'అరణీ' అనే పేరుతో పిలుస్తారు. అగ్నిని ఉద్భవించేందుకు కాష్టాంతరంచే మదింపయోగ్యమైన దారువని, "ఆరణి' అని అర్థం. అందుకే పూర్వకాలం నుండి శమీవృక్షం పూజనీయమైంది. బిల్వాష్టకంలో

**(ఎనిమిది విధాల బిల్వములలో), జమ్మి ఒకటి.**
**తులసీ బిల్వ నిర్గుండీ అపామార్గ కపిత్థగౌ**
**(తులసి, మారేడు, వావిలి, ఉత్తరేణి, వెలగ)**
**శమీ చ ఆమలకం దూర్వా అష్టబిల్వా ప్రకీర్తితాః**
**(శమీ, ఉసిరి, గరిక)**

## యుద్ధాల్లో సాంకేతికత ఆందోళనకరం: రాజ్‌నాథ్

న్యూఢిల్లీ: ప్రస్తుత యుద్ధాల్లో ఆధునిక సాంకేతికత వినియోగం ఆందోళనకరంగా పెరుగుతోందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. డిఫెన్స్ అకౌంట్స్ డిపార్టుమెంట్ 278వ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన ప్రసంగిస్తూ, భారత రక్షణ రంగంలో పరిశోధన, అభివృద్ధిని బలోపేతం చేయడానికి ఒక వినూత్నమైన పర్యావరణ వ్యవస్థను రూపొందించనున్నట్లు వెల్లడించారు. యుద్ధాల్లో ఆధునిక సాంకేతికత వినియోగం పెరగడంపై రాజ్‌నాథ్ సింగ్ ఆందోళన వ్యక్తం చేశారు. అత్యాధునిక సాంకేతికతలు సంవత్సరాల తరబడి పరిశోధన మరియు అభివృద్ధి ఫలితంగా రూపొందించబడినవని ఆయన పేర్కొన్నారు. మనం కూడా ఈ సాంకేతికతను అందిపుచ్చుకోవలసిన అవసరం ఉందని ఆయన అన్నారు. మన చుట్టూ ఉన్న పరిస్థితులు మారుతున్నాయని, దేశ భద్రతా అవసరాలు కూడా పెరుగుతున్నాయని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఈ కారణంగానే రక్షణ బడ్జెట్ ప్రతి సంవత్సరం పెరుగుతోందని ఆయన అన్నారు. బడ్జెట్ పెరుగుతున్నందున, దానిని సద్వినియోగం చేసుకోవలసిన బాధ్యత కూడా రెట్టింపు అవుతుందని ఆయన స్పష్టం చేశారు. సాంకేతిక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఆయన నొక్కి చెప్పారు. దేశీయ సాంకేతిక వ్యవస్థను అభివృద్ధి చేయడానికి నిధులను పెంచుతున్నట్లు ఆయన తెలిపారు.

## అత్యంత సంపన్న మహిళగా రోష్ని నాడార్

ముంబై: హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఛైర్‌పర్సన్ రోష్ని నాడార్ మల్హోత్రా మరోసారి తన ప్రత్యేకతను చాటుకున్నారు. భారతదేశంలో అత్యంత సంపన్న మహిళగా అగ్రస్థానంలో నిలవడమే కాకుండా, దేశంలోని టాప్ 10 కుబేరుల జాబితాలో అతి పిన్న వయస్కురాలిగానూ రికార్డు సృష్టించారు. ప్రముఖ సంస్థ ఎం3ఎం హురున్ ఇండియా 2025 సంవత్సరానికి గాను విడుదల చేసిన సంపన్నుల జాబితాలో ఈ విషయం వెల్లడైంది. ఈ నివేదిక ప్రకారం, రోష్ని నాడార్ మల్హోత్రా సంపద విలువ ఏకంగా రూ. 2.84 లక్షల కోట్లుగా ఉన్నట్లు అంచనా వేశారు.


# అమెరికా షట్‌డౌన్

**ఆరేళ్లలో తొలిసారి**



వాషింగ్టన్: కీలకమైన బిల్లులకు ఆమోదం లభించకపోవడంతో అమెరికా ప్రభుత్వం షట్‌డౌన్‌ను ఎదుర్కొంటోంది. ఆరేళ్ల తర్వాత తొలిసారి ఇలా జరిగింది. అర్ధరాత్రి గడువుకు ముందే రెండు నిధుల బిల్లులను సెనెట్ ఆమోదించకపోవడంతో అమెరికా ప్రభుత్వం షట్‌డౌన్‌లోకి వెళ్లింది. అమెరికా కాలమానం ప్రకారం బుధవారం మొదలుకాగానే(భారత కాలమానం ప్రకారం ఉదయం 9.30కి) ఈ ప్రక్రియ ప్రారంభమైంది. తమ డిమాండ్లు నెరవేర్చని రిపబ్లికన్ స్టాపేజ్ ఫండింగ్ బిల్లును డెమోక్రాట్లు అడ్డుకోవడంతో ఈ షట్‌డౌన్ మొదలైంది. దీంతో అత్యవసరం కాని సేవల కార్యకలాపాలు నిలిచిపోతాయి. అమెరికాలో లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. దాదాపు 7,50,000 మందిని పని ప్రదేశంలో రిపోర్టు చేయవద్దంటారు. మిలిటరీ, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వంటి విభాగాల్లోని లక్షల మంది సిబ్బంది మాత్రం అత్యవసర సేవలు కొనసాగించాల్సి ఉంటుంది. వీరితో సెలవుల్లో కూడా పని చేయించుకొని చెక్ ఇవ్వని పరిస్థితి ఉంటుంది. షట్‌డౌన్ ముగిశాకే.. వారికి పాత వేతనాల చెల్లింపులు జరుగుతాయి. కొన్ని కాంట్రాక్టుల్లో ఈ చెల్లింపులకు ఎలాంటి హామీలు ఉండవని తెలిపింది. సోషల్ సెక్యూరిటీ, మెడికేర్ లబ్ధిదారులపై దీని ప్రభావం ఉండదు. వీరికి సంబంధించిన ప్రయోజనాలను కాంగ్రెస్ ప్రత్యేక చట్టం రూపంలో ఆమోదం తెలుపుతుంది. వీటికి వార్షిక చెల్లింపులు అవసరం లేదు. కానీ, సోషల్ సెక్యూరిటీ ఆఫీస్‌లు అందించే ప్రయోజనాలు పరిమితంగా ఉంటాయి. నేషనల్ పార్క్ సర్వీసులు మూతపడతాయి. 2013లో వందలకొద్దీ పార్కులు, మ్యూజియంలు, ఇతర ప్రదేశాలను మూసేశారు. ఈ మూసివేత వల్ల వెంటనే ఆర్థిక ప్రభావం పడకపోయినా.. దీర్ఘకాలంగా కొనసాగితే మాత్రం ఆర్థిక వృద్ధి మందగిస్తుంది. మార్కెట్లకు అంతరాయం కలిగిస్తుంది. ఇవన్నీ ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. అయితే 2018లో జరిగిన షట్‌డౌన్‌తో ఈసారి కాస్త తీవ్రత ఎక్కువగా ఉండొచ్చని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ షట్‌డౌన్‌లో ఉన్న ప్రతివారం ఆర్థిక వృద్ధిలో 0.1 నుంచి 0.2 పాయింట్లు తగ్గొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం చట్టసభ సభ్యుల్లో రాజీ సూచనలు కనిపించడం లేదు. అమెరికాలో షట్‌డౌన్ మొదలైతే ఎంతకాలం కొనసాగుతుందో చెప్పలేము. 1981 నుంచి అమెరికా ప్రభుత్వం 15 సార్లు మూతపడింది. 2018–19 మధ్య దాదాపు 35 రోజుల పాటు మూతపడగా.. నాడు ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్నారు. అమెరికా చరిత్రలోనే అది సుదీర్ఘమైన షట్‌డౌన్.

# వికీపీడియాకు పోటీగా మస్క్ గ్రోకిపీడియా




న్యూయార్క్: టెక్నాలజీ ప్రపంచంలో సంచలనాలకు కేంద్ర బిందువుగా నిలిచిన ఎలాన్ మస్క్, మరో కీలక ప్రకటనతో ముందుకొచ్చారు. ప్రముఖ ఆన్‌లైన్ విజ్ఞాన సర్వస్వం (ఎన్‌సైక్లోపీడియా) వికీపీడియాకు పోటీగా, అంతకంటే మెరుగైన ప్లాట్‌ఫామ్‌ను రూపొందిస్తున్నట్లు తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు. 'గ్రోకిపీడియా' పేరుతో రానున్న ఈ కొత్త ఆన్‌లైన్ ఎన్‌సైక్లోపీడియాను తన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్టార్టప్–ఏఐని అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వికీపీడియాతో పోలిస్తే మరింత విశ్వసనీయమైన, పారదర్శకమైన, కచ్చితమైన సమాచారాన్ని అందించడమే దీని ముఖ్య ఉద్దేశమని మస్క్ పేర్కొన్నారు. తన సంస్థ అభివృద్ధి చేసిన గ్రోక్ ఏఐ టెక్నాలజీని ఈ ప్లాట్‌ఫామ్‌లో వినియోగించనున్నారు. విశ్వాన్ని మరింత లోతుగా అర్థం చేసుకునే ప్రయత్నంలో భాగంగానే ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు ఆయన వివరించారు. మానవాళికి కృత్రిమ మేధస్సును ప్రయోజనకరంగా మార్చాలన్న తన ఆశయానికి అనుగుణంగానే గ్రోకిపీడియా ఉంటుందని భావిస్తున్నారు. అయితే, ఎలాన్ మస్క్ ప్రకటనపై ఇంటర్నెట్‌లో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. కొందరు నెటిజన్లు ఆయన ప్రయత్నాన్ని స్వాగతిస్తుండగా, మరికొందరు విమర్శలు గుప్పిస్తున్నారు. సమాచారం కోసం గ్రోక్ ఏఐ ఇప్పటికే వికీపీడియా డేటాను ఎక్కువగా వాడుకుంటున్నప్పుడు, గ్రోకిపీడియా అంతకంటే ఎలా మెరుగ్గా ఉంటుందని కొందరు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో, గ్రోకిపీడియా రాకతో ఆన్‌లైన్ సమాచార ప్రపంచంలో ఎలాంటి మార్పులు వస్తాయోనని టెక్ నిపుణులు ఆసక్తిగా గమనిస్తున్నారు.

## ఆఫ్ఘనిస్థాన్‌లో ఇంటర్నెట్ షట్‌డౌన్

కాబూల్: ఆఫ్ఘనిస్థాన్‌లో తాలిబన్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో 'అనైతిక కార్యకలాపాలను' అరికట్టే పేరుతో ఇంటర్నెట్, టెలిఫోన్ సేవలను పూర్తిగా నిలిపివేసింది. ఈ చర్యతో సుమారు 4.3 కోట్ల మంది ప్రజలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోయారు. తాలిబన్ల పాలనలో దేశవ్యాప్తంగా కమ్యూనికేషన్ వ్యవస్థను ఇలా పూర్తిగా మూసివేయడం ఇదే తొలిసారి. ప్రముఖ అంతర్జాతీయ ఇంటర్నెట్ వాచ్‌డాగ్ సంస్థ నెట్‌బ్లాక్స్ ఈ విషయాన్ని ధ్రువీకరించింది. సోమవారం దశలవారీగా అనేక నెట్‌వర్క్‌లను నిలిపివేశారని, చివరికి టెలిఫోన్ సేవలను కూడా నిలిపివేయడంతో ఇది 'సంపూర్ణ ఇంటర్నెట్ బ్లాక్‌అవుట్'గా మారిందని పేర్కొంది. ఫైబర్–ఆప్టిక్ కేబుళ్ల ద్వారానే ఫోన్ కాల్స్ కూడా పనిచేస్తుండటంతో, ఇంటర్నెట్‌తో పాటు అవి కూడా మూగబోయాయి. దేశంలోని మొబైల్ ఫోన్లలో 3జీ, 4జీ ఇంటర్నెట్ సేవలను వారం రోజుల్లోగా నిలిపివేయాలని, కేవలం 2జీ నెట్‌వర్క్‌ను మాత్రమే అందుబాటులో ఉంచాలని అధికారులు ఆదేశించినట్లు స్థానిక మీడియా సంస్థ టోలోన్యూస్ నివేదించింది. కాబూల్, హెరాత్, కాందహార్ వంటి ప్రధాన నగరాల్లో ఇంటర్నెట్ వినియోగం అత్యంత తీవ్రంగా పడిపోయినట్లు క్లౌడ్‌ఫ్లేర్ రాడార్ అనే సంస్థ తెలిపింది. తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు ఈ బ్లాక్‌అవుట్ కొనసాగుతుందని, సుమారు 8 నుంచి 9 వేల టెలికమ్యూనికేషన్స్ టవర్లను మూసివేస్తున్నామని ప్రభుత్వ అధికారి ఒకరు తెలిపినట్లు ఏఎఫ్‌పీ వార్తా సంస్థ పేర్కొంది. ఈ నిర్ణయం దేశంపై తీవ్ర ప్రభావం చూపనుంది. ఇటీవల భారీ భూకంపంతో అతలాకుతలమైన ఆఫ్ఘనిస్థాన్‌కు మానవతా సాయం అందించేందుకు ఈ నిర్ణయం తీవ్ర ఆటంకంగా మారింది. అంతేకాకుండా, విమాన సేవలు, బ్యాంకింగ్ వ్యవస్థలు, ఆసుపత్రులు, ఆన్‌లైన్ వ్యాపారాలు పూర్తిగా స్తంభించిపోయే ప్రమాదం ఏర్పడింది. ముఖ్యంగా, తాలిబన్ల ఆంక్షల కారణంగా ఇళ్లకే పరిమితమైన మహిళలు, బాలికలు ఆన్‌లైన్ విద్యకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. ఈ చర్యపై మహిళా హక్కుల కార్యకర్త సనమ్ కబీరి స్పందిస్తూ "ప్రజలను అణచివేసేందుకు తాలిబన్లు తమ వద్ద ఉన్న ప్రతి సాధనాన్ని వాడుతున్నారు" అని ఆవేదన వ్యక్తం చేశారు.



## వయ్యారి చిత్రం










## ఆస్తిలో ప్రపంచంలోనే 'కింగ్' ఖాన్

కింగ్ ఖాన్ షారుఖ్ రూ. 12,490 కోట్ల నికర సంపదలతో ప్రపంచంలోనే అత్యంత సంపన్న నటుడిగా రికార్డులకెక్కారు. అక్టోబర్ 1న విడుదలైన హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2025 వెల్లడించిన వివరాల ప్రకారం... బాలీవుడ్ సూపర్‌స్టార్ బిలియనీర్ క్లబ్ లో చేరారు. షారూఖ్ 33 ఏళ్ల సినీకెరీర్ లో అద్భుతమైన ఆర్థిక మైలురాయిని అందుకున్నారని హురూన్ ప్రకటించింది. హురూన్ ప్రకారం.. అంతర్జాతీయ వేదికపై షారుఖ్ ఎదుగుదల అజేయంగా కొనసాగుతోంది. బాద్ షా రూ. 12,490 కోట్ల (1.4 బిలియన్ డాలర్లు) సంపదతో మొదటిసారిగా బిలియనీర్ క్లబ్‌లో చేరారు. షారూఖ్ పలువురు హాలీవుడ్ స్టార్లను సైతం వెనక్కి నెట్టాడు. టేలర్ స్విఫ్ట్ (1.3 బిలియన్), ఆర్నాల్డ్ స్క్వార్జెనెగర్ (1.2 బిలియన్), జెర్రీ సీన్‌ఫెల్డ్ (1.2 బిలియన్), సెలీనా గోమెజ్ (720 మిలియన్) సహా పలువురు అంతర్జాతీయ ప్రముఖుల సంపదను షారూఖ్ సంపద మించిపోయింది. కింగ్ ఖాన్ సంపదలు స్థిరంగా పెరుగుతున్నాయని హురూన్ రిపోర్ట్ నిరూపిస్తోంది. మరోవైపు వెటరన్ నటి, వ్యాపారవేత్త జూహి చావ్లా, ఆమె కుటుంబ సంపదలు 7,790 కోట్ల నికర విలువతో తర్వాత స్థానంలో ఉండగా, హృతిక్ రోషన్ రూ. 2,160 కోట్లతో మూడో స్థానంలో ఉన్నారు. కింగ్ ఖాన్ ఆస్తులు అనూహ్యంగా ఒక ఏడాదిలోనే భారీగా పెరిగాయి. గత సంవత్సరం 870 మిలియన్ డాలర్ల నికర ఆస్తులతో అతడు జాబితాలో అగ్రస్థానంలో ఉన్నారు. ఇప్పుడు 870 మిలియన్ డాలర్ల నుంచి 1.4 బిలియన్ డాలర్ల రేంజుకు అతడి సంపదలు ఎదిగాయి అంటే, సినిమాల ద్వారా ఆదాయం సహా అతడి ఇతర వ్యాపార సంస్థల అభివృద్ధి అన్ స్టాపబుల్ గా కొనసాగుతందని అర్థం చేసుకోవచ్చు.




## ఎంగేజ్మెంట్ డేట్ ప్రకటించిన అల్లు శిరీష్

త్వరలో అల్లు వారింట పెళ్లి భాజాలు మోగనున్నాయి.. ఈ విషయాన్ని అల్లు వారబ్బాయి స్వయంగా సోషల్ మీడియా ద్వారా ప్రకటించడంతో అల్లు అభిమానుల ఆనందానికి అవధులు లేవని చెప్పవచ్చు. విషయంలోకి వెళ్తే.. అల్లు హీరోగా గుర్తింపు తెచ్చుకున్నారు అల్లు శిరీష్.. ప్రముఖ టాలీవుడ్ బడా నిర్మాత అల్లు అరవింద్ తనయుడిగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన అల్లు శిరీష్ ఇప్పుడు తన మనసుకు నచ్చిన అమ్మాయితో నిశ్చితార్థానికి సిద్ధమయ్యారు. ఈ మేరకు ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ వేదికగా ఒక పోస్ట్ పంచుకున్నారు. "నేడు మా తాతయ్య నటరత్న , డాక్టర్ అల్లు రామలింగయ్య జయంతి సందర్భంగా నా హృదయానికి దగ్గరైన ఒక విషయాన్ని నేను మీతో పంచుకుంటున్నాను. నయానికాతో అక్టోబర్ 31వ తేదీన నా నిశ్చితార్థం అని మీకు చెప్పడానికి చాలా ఎక్సైట్ గా ఫీల్ అవుతున్నాను. ఇటీవల మా నానమ్మ అల్లు కనకరత్నమ్మ మరణించారు. ఆమె ఎప్పుడూ నా పెళ్లి చూడాలని కోరుకునేది. ఇప్పుడు ఆమె ఎక్కడ ఉన్నా.. మమ్మల్ని ఆశీర్వదిస్తూ ఉండి ఉంటారు. మా కుటుంబాలు, మా ప్రేమను ఆనందంతోనే ఆమోదించాయి" అంటూ తెలిపాడు.

## శ్రీనిధి కెరీర్లో తొలిసారి..!

మామూలుగా ఏ యాక్టర్ కి అయినా మొదటి సినిమాతోనే మంచి హిట్ అందుకుని కెరీర్ స్టార్టింగ్ నుంచే మంచి అవకాశాలను అందుకుంటూ కెరీర్లో ముందుకెళ్లాలని అనుకుంటూ ఉంటారు. అయితే ఎవరికైనా అనుకోవడం వరకే వారి చేతుల్లో ఉంటుంది. అది అవడం అవకపోవడం విధి లిఖితం. మొదటి సినిమాతోనే హిట్ అందుకునే అదృష్టం చాలా తక్కువ మందికే ఉంటుంది. అందులో శ్రీనిధి శెట్టి కూడా ఒకరు. కెజిఎఫ్ ఫ్రాంచైజ్ సినిమాలతో ఎవరూ ఊహించని డెబ్యూని అందుకున్నారు శ్రీనిధి. మోడలింగ్ తో కెరీర్ ను స్టార్ట్ చేసిన శ్రీనిధి, ఆ తర్వాత 2018లో కెజిఎఫ్ మూవీతో సినీ రంగంలోకి అడుగుపెట్టారు. కెజిఎఫ్, కెజిఎఫ్2 సినిమాల్లో శ్రీనిధి నటనకు ఎంతో మంది ముగ్ధులయ్యారు. ఆ తర్వాత నేచురల్ స్టార్ నాని తో కలిసి హిట్3 సినిమా చేశారు



## పెద్ద స్టార్ అయినా సెట్‌లో స్టూడెంటే

బాలీవుడ్ భామ జాన్వీ కపూర్ ఓ వైపు బాలీవుడ్ లో సినిమాలు చేస్తూనే మరోవైపు టాలీవుడ్ లో కూడా వరుస సినిమాలు చేస్తూ చాలా బిజీగా మారిన సంగతి తెలిసిందే. మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ సరసన దేవరలో నటించి టాలీవుడ్ కు పరిచయమైన జాన్వీ ఆ సినిమాతో మంచి వెల్‌కమ్‌ను అందుకున్నారు. దేవర రిలీజ్ అవకముందే జాన్వీ మరో తెలుగు సినిమాకు కూడా సైన్ చేశారు. అదే పెద్ది సినిమా. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సాన దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తున్నారు. చరణ్ సరసన జాన్వీ నటిస్తున్న మొదటి సినిమా కావడంతో వీరిద్దరి జంట ఆన్‌స్క్రీన్ ఎలా ఉంటుందో చూడాలని చాలా మంది ఎంతో ఎగ్జైటింగ్ గా ఉన్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతున్న పెద్ది షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతుంది. ఓ ఇంటర్వ్యూలో జాన్వీ, రామ్ చరణ్ గురించి, బుచ్చిబాబు గురించి మాట్లాడారు. పెద్ది మూవీలో తన రోల్ బ్లాస్ట్ అయ్యేలా ఉంటుందని, తన పాత్ర అందరికీ ఎంతో ఆసక్తిని కలిగిస్తుందని చెప్పారు జాన్వీ. బుచ్చిబాబు గతంలో తీసిన ఉప్పెన సినిమా సూపర్ హిట్ గా నిలిచిందని, ఆయన రూటెడ్ డైరెక్టర్ అని, బుచ్చిబాబు కు ఒక విజన్ ఉందని తెలిపిన జాన్వీ, రామ్ చరణ్ వర్కింగ్ స్టైల్ కు ఫిదా అయ్యానని చెప్పారు. రామ్ సర్ అంటే ఆలా ఇష్టమని, ఆయన ఓ జెంటిల్‌మెన్ అని, చాలా ఎనర్జిటిక్ గా ఉంటారని, ఆయనెంతో సీనియర్, తన అదృష్టంగా భావిస్తున్నానని జాన్వీ చెప్పుకొచ్చారు.



## ముఖాన్ని అద్దంలో చూసుకొమ్మన్నారు



బాలీవుడ్ హాట్ లేడీ భూమీ పడ్నేకర్.. ప్రస్తుతం వరుస విజాయాలతో దూసుకుపోతుంది. గత ఏడాది ఏకంగా నాలుగు రిలీజ్ లతో మంచి ఫలితాలే సాధించింది. భీద్ ..%-% అఫ్వా%- ..-% థాం క్యూ ఫర్ కమింగ్%-% ..ది లేడీ కిల్లర్, భక్షక్ లాంటి విజయాలు ఖాతాలో వేసుకుంది. లైంగిక వేధింపుల నుండి బాలికలను రక్షించే జర్నలిస్ట్ పాత్ర లో నటించి విమర్శకుల ప్రశంసలందుకుంది. నటిగా ఆమె బాధ్యతను పెంచిన చిత్రంగా నిలిచింది. అలాగే సామాజిక కార్యక్రమాల్లోనూ అమ్మడు చురుకుగా పాల్గొంటుంది. క్లైమేట్ వారియర్ అండ్ భూమీ ఫౌండేషన్ ద్వారా పర్యావరణానికి అందిస్తోన్న విశేష సేవలకు గానూ యంగ్ గ్లోబల్ లీడర్ గా భూమీ పడ్నేకర్ ను వరల్డ్ ఎకనామిక్ ఫోరం ప్రకటించింది. ఆ రకంగా అంతర్జాతీయంగానూ భూమీకి ప్రత్యేకమైన గుర్తింపు దక్కుతోంది. ప్లాస్టిక్ నిర్మూలన దిశగానూ నిర్వహిస్తోన్న అవగాహన కార్యక్రమాల్లో పాలు పంచుకుంటుంది. అలాంటి భూమీ పడ్నేకర్ కెరీర్ ఆరంభంలో ఎదుర్కొన్న విమర్శల గురించి తాజాగా రివీల్ చేసింది. సినిమాల్లోకి వచ్చిన కొత్తలో కొందరు తనను నటివి అవుతావా? అని ఎగతాళి చేసారట. ముఖం అద్దంలో చూసుకోమని వెక్కిరించేవారట. ఆ విమర్శలు..వెక్కిరింపులనే తన విజయానికి సోపానాలుగా మార్చుకున్నట్లు తెలిపింది.

ఈవార్తలు
క్రీడావాణి SPORTS
గురువారం 2-10-2025 | www.evarthalu.com


## దెబ్బకు దిగొచ్చిన నఖ్వీ

బీసీసీఐ ఆగ్రహంతో యూఏఈ బోర్డుకు ట్రోఫీ అప్పగింత

ఆసియా కప్ టైటిల్‌ను గెలిచినప్పటికీ, ట్రోఫితో పాటు మెడల్స్ భారత జట్టుకు అందలేదు. పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ఏసీసీ చీఫ్, పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ మోహిన్ నఖ్వీ చేతుల మీదుగా వాటిని స్వీకరించడానికి భారత క్రికెటర్లు నిరాకరించారు. దీంతో ట్రోఫీ, మెడల్స్‌ను నఖ్వీ తనతో పాటు తీసుకువెళ్లాడు. నఖ్వీ ట్రోఫీ, మెడల్స్‌ను తీసుకెళ్లడంపై బీసీసీఐ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏసీసీ సర్వసభ్య సమావేశంలో ఈ విషయంపై తీవ్రంగా స్పందించింది. ట్రోఫీని, మెడల్స్‌ను భారత జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తన కార్యాలయానికి వచ్చి తీసుకోవాలని నఖ్వీ పేర్కొన్నట్లు సమాచారం. ఈ అంశాన్ని బీసీసీఐ, ఐసీసీ దృష్టికి తీసుకువెళ్లే ప్రయత్నం చేసింది.

## మా చెక్కులు బౌన్స్ అయ్యాయి

**పాక్ మాజీ స్పిన్నర్ అజ్మల్**

పాకిస్తాన్‌లో క్రికెట్ నిర్వహణ, పాలన తీరును ఆ దేశ మాజీ స్పిన్నర్ సయీద్ అజ్మల్ బయటపెట్టాడు. 2009 టీ20 వరల్డ్ కప్ గెలిచిన తర్వాత అప్పటి ప్రధానమంత్రి ప్లేయర్స్‌కు ఇచ్చిన హామీ నెరవేరలేదని వెల్లడించాడు. యూనిస్ ఖాన్ నాయకత్వంలో పాకిస్తాన్ 2009లో ఇంగ్లండ్‌లోని లార్డ్స్‌లో శ్రీలంకను ఓడించి టైటిల్ గెలుచుకుంది. ఇది పాకిస్తాన్ క్రికెట్‌కు ఒక చారిత్రాత్మక క్షణం. అయితే, ప్రపంచకప్ గెలిచిన సందర్భంలో ఆటగాళ్లకు లభించి గుర్తింపు.. ప్రకటించిన ప్రోత్సాహకాలన్నీ బూటకమేనని మాజీ స్పిన్నర్ వెల్లడించారు.



# చరిత్ర సృష్టించిన అభిషేక్

టీమిండియా యువ సంచలనం, స్టార్ బ్యాటర్ అభిషేక్ శర్మ ఐసీసీ పురుషుల టీ20 అంతర్జాతీయ ర్యాంకింగ్స్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఆసియా కప్ 2025లో అద్భుత ప్రదర్శన చేసిన 25 ఏళ్ల ఈ లెఫ్ట్ హ్యాండర్ బ్యాటర్ ఏకంగా 931 రేటింగ్ పాయింట్లు సాధించాడు. ఈ స్కోరు 2020 నుంచి ఇంగ్లాండ్‌కు చెందిన డేవిడ్ మలన్ పేరిట ఉన్న (919) రికార్డును బద్దలు కొట్టి ఆల్‌టైమ్ బెస్ట్‌గా నిలిచింది. ఆసియా కప్‌లో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు గెలుచుకున్న అభిషేక్ శర్మ.. టోర్నమెంట్‌లో మొత్తం 7 మ్యాచ్‌ల్లో 314 పరుగులు చేశాడు. ఈ సమయంలో అభిషేక్ శర్మ సగటు దాదాపు 45, స్ట్రైక్ రేట్ 200గా ఉంది. ఈ దూకుడైన ఆటతీరు అభిషేక్ శర్మ టీ20 బ్యాటర్లలో నంబర్ వన్ స్థానంలో నిలబెట్టింది. సూపర్ 4లో శ్రీలంకపై 61, బంగ్లాదేశ్‌పై 75 పరుగుల ఇన్నింగ్స్‌లు ఆడిన తర్వాత అభిషేక్ శర్మ రేటింగ్ స్కోరు 931కి చేరుకుంది. ఈ ప్రదర్శనతో అభిషేక్ శర్మ కేవలం మలన్‌ను మాత్రమే కాక, భారత లెజెండరీ బ్యాటర్ విరాట్ కోహ్లీ కెరీర్ హై అయిన 909 పాయింట్ల రికార్డును కూడా అధిగమించాడు.

## నఖ్వీ రాజీనామా చేయాలి: అఫ్రిదీ

పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) ఛైర్మన్ బాధ్యతల నుంచి మోహ్‌సీన్ నఖ్వీ తప్పుకోవాలని ఆ జట్టు మాజీ క్రికెటర్ షాహిద్ అఫ్రిదీ డిమాండ్ చేశాడు. ఆసియా కప్ 2025 టోర్నీలో పాకిస్థాన్ జట్టు వైఫల్యం నేపథ్యంలో అఫ్రిది ఈ ప్రతిపాదన చేశాడు. పాకిస్థాన్ మంత్రిగా.. పీసీబీ ఛైర్మన్‌గా నఖ్వీ న్యాయం చేయలేకపోతున్నాడని అభిప్రాయపడ్డాడు. పాకిస్థాన్ క్రికెట్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపే ఛైర్మన్ కావాలని అఫ్రిది నొక్కి చెప్పాడు. ఆసియా కప్ 2025 టోర్నీలో పాకిస్థాన్ జట్టు భారత్ చేతిలో ఘోర పరాజయాలను ఎదుర్కొంది. భారత్‌తో ఆడిన మూడు మ్యాచ్‌లకు మూడింటిని పాకిస్థాన్ ఓడిపోయింది. ఫైనల్లో పోటీ ఇచ్చినా తొలి రెండు మ్యాచ్‌ల్లో చిత్తయ్యింది. ఆసియా క్రికెట్ కౌన్సిల్ ప్రెసిడెంట్‌గా కూడా నఖ్వీ వ్యవహరిస్తున్నాడు. కీలక పదవుల్లో ఉన్న నఖ్వీ పూర్తిగా సలహాదారుపై ఆధారపడుతున్నాడని అఫ్రిది ఆరోపించాడు. 'పీసీబీ ఛైర్మన్, పాకిస్థాన్ మంత్రి అయిన మోహ్‌సిన్ నఖ్వీ సాబ్‌కు నా అభ్యర్థన, సలహా ఏంటంటే.. పీసీబీ ఛైర్మన్ బాధ్యతల నుంచి వీలైనంత త్వరగా తప్పుకోవాలి. పీసీబీ అనేది పాకిస్థాన్ మంత్రిత్వ శాఖ కంటే పూర్తిగా భిన్నమైనది. కాబట్టి పీసీబీకి ఆయన దూరంగా ఉండాలి. పాకిస్థాన్ క్రికెట్‌కు ప్రత్యేక శ్రద్ధ, సమయం కేటాయించే వ్యక్తి అవసరం. నఖ్వీ పూర్తిగా సలహాదారులపైనే ఆధారపడుతున్నారు. ఈ సలహాదారులు ఆయనను తప్పుదోవ పట్టిస్తున్నారు. క్రికెట్ గురించి తెలియదని ఆయనే స్వయంగా చెప్పారు. కాబట్టి ఆట గురించి తెలిసిన వ్యక్తులను పీసీబీ ఛైర్మన్‌గా, సలహాదారులుగా నియమించాలి.'అని అఫ్రిది విజ్ఞప్తి చేశాడు. ఆసియా కప్ 2025 టోర్నీ సందర్భంగా భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య అనేక వివాదాలు చోటు చేసుకున్నాయి. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో పాకిస్థాన్ ఆటగాళ్లకు షేక్ హ్యాండ్ ఇచ్చేందుకు భారత ఆటగాళ్లు నిరాకరించారు. అయితే ఈ ఘటనపై పీసీబీ ఛైర్మన్‌గా నఖ్వీ అనవసర వివాదాన్ని సృష్టించాడు. మ్యాచ్ రిఫరీని తొలగించాలంటూ ఐసీసీకి ఫిర్యాదు చేశాడు. ఐసీసీ పట్టించుకోకపోవడంతో టోర్నీ నుంచి తప్పుకుంటామని బెదిరింపులకు దిగాడు. ఇక ఆసియా కప్ ఫైనల్ అనంతరం నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీని తీసుకునేందుకు భారత్ నిరాకరించడంతో.. ఆ టైటిల్‌ను ఆటగాళ్లకు ఇవ్వకుండా తన వెంట తీసుకెళ్లిపోయాడు. ఈ వ్యవహారంపై భారత్ ఆగ్రహం వ్యక్తం చేయగా.. క్షమాపణలు చెప్పిన నఖ్వీ.. టైటిల్ కావాలంటే ఏసీసీ ఆఫీస్‌కు వచ్చి తీసుకెళ్లాలని కండిషన్ పెట్టాడు. దాంతో మరింత ఆగ్రహానికి గురైన బీసీసీఐ.. ఐసీసీకి ఫిర్యాదు చేసేందుకు సిద్దమైంది.





## వైభవ్ సూర్యవంశీ సెంచరీల మీద సెంచరీలు

ఆస్ట్రేలియా గడ్డపై టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ దుమ్మురేపుతున్నాడు. వన్డే ఫార్మాట్‌లో పరుగుల మోత మోగించిన ఈ చిచ్చర పిడుగు.. టెస్ట్ ఫార్మాట్‌లోనూ అదే జోరు కొనసాగిస్తున్నాడు. ఆస్ట్రేలియా అండర్ 19తో జరుగుతున్న తొలి యూత్ టెస్ట్‌లో వైభవ్ సూర్యవంశీ సెంచరీతో చెలరేగాడు. తనదైన విధ్వంసకర బ్యాటింగ్‌తో 78 బంతుల్లోనే సెంచరీ మార్క్ అందుకున్నాడు. ఈ ఇన్నింగ్స్‌లో సూర్యవంశీ 7 సిక్స్‌లు బాదడం గమనార్హం. తద్వారా యూత్ టెస్ట్‌ల్లో అత్యధిక సిక్స్‌లు బాదిన భారత బ్యాటర్‌గా రికార్డ్ సాధించాడు. ఈ క్రమంలో అతను అండర్ 19 ఏ కెప్టెన్ ఆయుష్ మాత్రే రికార్డ్‌ను అధిగమించాడు. యూత్ టెస్ట్‌ల్లో సూర్యవంశీ 14 సిక్స్‌లు బాదగా.. ఆయుష్ మాత్రే 9 సిక్స్‌లు కొట్టాడు. వైభవ్ సూర్యవంశీ సెంచరీతో ఈ మ్యాచ్‌లో భారత్ అండర్ 19 జట్టు భారీ స్కోర్ దిశగా సాగుతోంది. 43 ఓవర్లు ముగిసే సరికి 3 వికెట్లకు 269 పరుగులు చేసింది. వైభవ్ సూర్యవంశీ(86 బంతుల్లో 9 ఫోర్లు, 8 సిక్స్‌లతో 113 నాటౌట్) సెంచరీతో చెలరేగాడు. వేదాంత్ త్రివేది(122 బంతుల్లో 15 ఫోర్లతో 96 నాటౌట్) సెంచరీ దిశగా సాగుతున్నాడు. ఆయుష్ మాత్రే(21) నిరాశపర్చాడు. ప్రస్తుతం భారత్ 35 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా అండర్ 19 జట్టు 243 పరుగులకు ఆలౌటైంది. స్టీవెన్ హొగన్(246 బంతుల్లో 8 ఫోర్లతో 92) తృటిలో శతకాన్ని చేజార్చుకున్నాడు. భారత బౌలర్లలో దీపేష్ దేవంద్రన్(5/45) ఐదు వికెట్లు తీయగా.. అమోజిత్ సింగ్, ఖిలన్ పటేల్ చెరో వికెట్ తీసారు.

## పీసీబీ చీఫ్‌పై కేసు

ఆసియా కప్ 2025లో భారత్ ఫైనల్ గెలిచి 72 గంటలకు పైగా అయ్యింది. అయినా విజేత జట్టుకు ట్రోఫీని అందజేయకపోవడంతో ఇప్పుడు ఈ వివాదం సంచలనం సృష్టిస్తోంది. ఆసియా క్రికెట్ కౌన్సిల్(ఏసీసీ) చీఫ్ మొహ్సిన్ నఖ్వీపై సంచలన ఆరోపణలు వస్తున్నాయి. ఆయన విజేత జట్టుకు ట్రోఫీని అప్పగించకుండా..తన హోటల్ గదికి ట్రోఫీని తీసుకెళ్లారని తెలుస్తోంది. మొహ్సిన్ నఖ్వీ ట్రోఫీని భారత జట్టుకు లేదా కనీసం ఏసీసీ కార్యాలయానికి కూడా పంపించలేదు. మంగళవారం జరిగిన ఏసీసీ సమావేశంలో ఈ విషయంపై చాలా దేశాల ప్రతినిధులు తీవ్ర నిరసన వ్యక్తం చేసినా.. మొహ్సిన్ నఖ్వీ తన పట్టుదలతో ట్రోఫీని హోటల్ గదిలోనే ఉంచారు. ఈ అంతర్జాతీయ క్రీడా స్ఫూర్తికి విరుద్ధమైన చర్యతో బీసీసీఐ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మొహ్సిన్ నఖ్వీపై ట్రోఫీ దొంగతనం, బలవంతంగా స్వాధీనం చేసుకున్నందుకు గానూ దుబాయ్ పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడానికి సన్నద్ధమవుతోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, బీసీసీఐ మొహ్సిన్ నఖ్వీకి 72 గంటల అల్టిమేటం ఇచ్చింది. ఈ సమయంలోగా ఆయన ట్రోఫీని ఏసీసీ ఆఫీస్‌కు పంపించకపోతే, దుబాయ్ పోలీసులకు అధికారికంగా కేసు నమోదు చేస్తారు. ట్రోఫీ విషయంలో మొహ్సిన్ నఖ్వీపై కేసు నమోదైతే దుబాయ్ కఠిన చట్టాల కారణంగా ఆయన జైలుకెళ్లేప్రమాదం ఉంది. దుబాయ్‌లో నేరాల రేటు చాలా తక్కువ. అక్కడ దొంగతనం లేదా బలవంతంగా ఆస్తిని స్వాధీనం చేసుకున్న కేసుల్లో శిక్ష తీవ్రతను బట్టి మారుతుంది. సాధారణంగా 6 నెలల నుంచి మూడేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా విధించవచ్చు. కొన్ని తీవ్రమైన కేసులలో 3 నుంచి 15 ఏళ్ల వరకు జైలు శిక్ష కూడా పడవచ్చు.

PCB
Pakistan Cricket Board

## డెలివరీ బాయ్‌కి స్వర్ణం!

**ఒకే రోజు భారత్‌కు 4 పతకాలు**

వరల్డ్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో భారత అథ్లెట్లు దుమ్మురేపారు. ఒకే రోజు రెండు స్వర్ణాలతో పాటు నాలుగు మెడల్స్‌ను గెలుచుకున్నారు. మంగళవారం జావెలిన్ త్రోలో రెండు బంగారు పతకాలు, ఒక రజతం రాగా.. డిస్కస్ త్రోలో యోగేశ్ కతూనియా రజతం సాధించాడు. పురుషుల ఎఫ్ 64 కేటగిరిలో సుమిత్ అంటిల్ జావెలిన్‌ను 71.37 మీటర్ల దూరం విసిరి అగ్రస్థానంలో నిలిచాడు. ఈ క్రమంలో తానే సృష్టించిన ఛాంపియన్‌షిప్ రికార్డ్(2023లో 70.83 మీటర్లు)ను తుడిచిపెట్టాడు. ఈ టోర్నీలో పసిడి హ్యాట్రిక్ కూడా కొట్టాడు. 2023, 24 పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లోనూ అతను స్వర్ణం సాధించాడు. సుమిత్ అంటిల్ ముందుగా రెజ్లర్ కావాలనుకున్నాడు. కానీ 17 ఏళ్ల వయసులో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. అతను నడుపుతున్న బైక్.. ట్రక్‌ను ఢీకొనడంతో ఎడమ కాలిని తీసేయాల్సి వచ్చింది. దాంతో రెజ్లర్ కావాలనే కల చెదిరింది.

ఈవార్తలు
ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
గురువారం 2-10-2025 | www.evarthalu.com

లాల్ బహదూర్ శాస్త్రి.. భారతదేశ మాజీ ప్రధానమంత్రి (1964-1966), సరళత, సమగ్రత, దేశభక్తికి చిహ్నంగా నిలిచారు. శాస్త్రి అత్యంత సాదాసీదా జీవన శైలికి ప్రసిద్ధి చెందారు. అధికారంలో ఉన్నప్పటికీ, ఆయన సామాన్య జీవనం గడిపారు, ఇది ప్రజలతో ఆయనకు గాఢమైన అనుబంధాన్ని ఏర్పరిచింది. 1965 భారత-పాకిస్థాన్ యుద్ధ సమయంలో ఆయన ఇచ్చిన ఈ నినాదం సైనికులు, రైతుల పాత్రను గౌరవించింది. దేశ రక్షణ, ఆహార భద్రతను ఒకే సమయంలో ఉద్దేశించిన ఈ నినాదం ఆయన దూరదృష్టిని చాటుతుంది. ఆహార కొరత సమస్యను ఎదుర్కొన్న సమయంలో, శాస్త్రి వ్యవసాయ ఆధునికీకరణకు మద్దతు ఇచ్చారు.



# జై జవాన్.. జై కిసాన్

## .....నేడు లాల్ బహదూర్ శాస్త్రి జయంతి.....

ఆయన నాయకత్వంలో ప్రారంభమైన హరిత విప్లవం భారతదేశాన్ని ఆహార ఉత్పత్తిలో స్వావలంబన వైపు నడిపించింది. శాస్త్రి అవినీతికి వ్యతిరేకంగా నిలిచారు. ఒకసారి ఆయన కుమారుడు అనధికారికంగా ప్రభుత్వ వాహనాన్ని ఉపయోగించినప్పుడు, ఆయన వ్యక్తిగతంగా దానికి జరిమానా చెల్లించారు, ఇది ఆయన నీతి నిబద్ధతకు నిదర్శనం. 1965 యుద్ధ సమయంలో ఆయన దేశాన్ని ఏకం చేసిన తీరు, ప్రజలను కష్టకాలంలో స్వయం నియంత్రణకు పిలుపునిచ్చిన విధానం ఆయన నాయకత్వ లక్షణాలను తెలియజేస్తాయి. స్వాతంత్ర్య సమరయోధుడిగా, శాస్త్రి గాంధీజీ సిద్ధాంతాలను అనుసరించి, అనేక ఉద్యమాలలో జైలు శిక్ష అనుభవించారు, దేశం కోసం తన జీవితాన్ని అర్పించారు. 1965 యుద్ధం తర్వాత, శాంతి కోసం తాష్కెంట్ ఒప్పందంపై సంతకం చేసిన తర్వాత, ఆయన అనుమానాస్పద స్థితిలో మరణించారు (1966). ఈ ఘటన ఆయన త్యాగాన్ని మరింత గుర్తుంచుకునేలా చేసింది. లాల్ బహదూర్ శాస్త్రి గారి సరళత, దేశభక్తి, నాయకత్వం భారతదేశ చరిత్రలో ఆయనను అమరత్వం పొందేలా చేశాయి. ఆయన జీవితం సామాన్య పౌరులకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

### బాల్యం అంతా పేదరికంలోనే..


శాస్త్రి బాల్యం పేదరికంలో గడిచింది. 1904 అక్టోబర్ 2న ఉత్తరప్రదేశ్‌లోని మొఘల్సరాయ్‌లోని వారణాసి సమీపంలో జన్మించారు. ఆయన తండ్రి శారదా ప్రసాద్ శ్రీవాస్తవ ఒక సామాన్య ఉపాధ్యాయుడు, తల్లి రామ్‌దులారీ దేవి. తండ్రి మరణం తర్వాత, తల్లితో కలిసి తాత ఇంటిలో పెరిగారు. వారణాసిలోని హరిశ్చంద్ర హైస్కూల్‌లో చదువుకున్నారు. తర్వాత కాశీ విద్యాపీఠంలో చేరి, 1925లో "శాస్త్రి" ఉపాధి పొందారు, ఇది ఆయన ఇంటిపేరుగా మారింది. శాస్త్రి 1928లో లలితా దేవిని వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు ఆరుగురు సంతానం. గాంధీజీ సిద్ధాంతాల నుండి ప్రేరణ పొంది, శాస్త్రి యుక్తవయసులోనే స్వాతంత్ర్య ఉద్యమంలో చేరారు. సైమన్ కమిషన్ వ్యతిరేక ఉద్యమం (1928), ఉప్పు సత్యాగ్రహం (1930), మరియు క్విట్ ఇండియా ఉద్యమం (1942)లో పాల్గొన్నారు.

ఈ ఉద్యమాల సమయంలో ఆయన బ్రిటిష్ ప్రభుత్వం చేత అనేకసార్లు జైలుకు వెళ్లారు. సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీలో చేరి, దేశ సేవ కోసం తన జీవితాన్ని అర్పించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, శాస్త్రి యూపీలో పోలీసు, రవాణా మంత్రిగా పనిచేశారు. 1951లో ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి అయ్యారు. కేంద్రంలో జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గంలో రైల్వే మంత్రిగా (1952-56), హోం మంత్రిగా (1961-63) పనిచేశారు. రైల్వే మంత్రిగా ఉన్నప్పుడు ఒక రైలు ప్రమాదం జరిగినప్పుడు నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేశారు, ఇది ఆయన నిజాయతీకి నిదర్శనం. నెహ్రూ మరణం తర్వాత, 1964లో శాస్త్రి భారత ప్రధానమంత్రి అయ్యారు.

# సత్యం.. అహింస

## ..నేడు మహాత్మా గాంధీ జయంతి

మహాత్మా గాంధీ సత్యం, అహింస సిద్ధాంతాలపైనే జీవించారు. స్వాతంత్ర్య సమరంలో అవే ఆయన ప్రధాన ఆయుధాలు. ఈ సిద్ధాంతాలు భారత స్వాతంత్ర్య ఉద్యమాన్ని మాత్రమే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా సామాజిక, రాజకీయ మార్పులకు స్ఫూర్తినిచ్చాయి. సత్యం అనేది గాంధీజీవితంలో అత్యంత ఉన్నతమైన సిద్ధాంతం. ఆయన సత్యాన్ని దైవంతో సమానంగా భావించారు, అంటే "సత్యమే దేవుడు" అని చెప్పారు. గాంధీ వ్యక్తిగత, సామాజిక జీవితంలో సత్యాన్ని అన్వేషించడం, దానిని ఆచరించడం ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. గాంధీ తన జీవితంలో సత్యాన్ని అన్వేషించడానికి "సత్యాగ్రహం" అనే పద్ధతిని అవలంబించారు. ఇది సత్యాన్ని ఆధారంగా చేసుకుని అన్యాయాన్ని ఎదిరించే మార్గం. దక్షిణాఫ్రికాలో జాతి వివక్షకు వ్యతిరేకంగా, భారత స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటిష్ అన్యాయానికి వ్యతిరేకంగా సత్యాగ్రహాన్ని ఉపయోగించారు. అహింస అనేది శారీరక, మానసిక హింసను పూర్తిగా తిరస్కరించడం, ప్రేమ, సహనం, శాంతితో సమస్యలను పరిష్కరించడం. గాంధీ అహింసను బలహీనుల ఆయుధంగా కాకుండా, ధైర్యవంతులు, ఆత్మశక్తి కలిగినవారి సాధనంగా భావించారు. అహింస శత్రువును కూడా స్నేహితునిగా మార్చగల శక్తి కలిగి ఉందని ఆయన విశ్వసించారు. అహింస ద్వారా గాంధీ బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని ఎదిరించారు. ఉప్పు సత్యాగ్రహం, భారత్ ఛోడో ఉద్యమంలో అహింసాయుత నిరసనలు, బహిష్కరణలు నిర్వహించారు. హింసాత్మక పరిస్థితుల్లో కూడా ( దేశ విభజన సమయంలో హిందూ-ముస్లిం ఘర్షణలు) శాంతి, సామరస్యాన్ని ప్రోత్సహించారు. గాంధీ సత్యం, అహింసను ఒకే నాణెం రెండు వైపులుగా భావించారు. సత్యం లక్ష్యం అయితే, అహింస దానిని సాధించే మార్గం. సత్యాగ్రహం అనేది సత్యాన్ని అనుసరించడానికి అహింసాయుతంగా పోరాడే పద్ధతి. ఇది అన్యాయాన్ని ఎదిరించడం, అయితే శత్రువును గౌరవించడం, వారితో సంప్రదింపులు జరపడం కూడా ఒక భాగం. గాంధీ సిద్ధాంతాలు అమెరికాలో మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ పౌర హక్కుల ఉద్యమం, దక్షిణాఫ్రికాలో నెల్సన్ మండేలా ఆపర్ట్‌హైడ్ వ్యతిరేక ఉద్యమం వంటి అనేక పోరాటాలకు స్ఫూర్తినిచ్చాయి. అహింస ద్వారా సామాజిక, రాజకీయ మార్పులు సాధ్యమని గాంధీ నిరూపించారు.



> సత్యం నా దేవుడు, అహింస దానిని సాధించే మార్గం. అహింస బలహీనుల ఆయుధం కాదు, అది ధైర్యవంతుల శక్తి. -మహాత్మాగాంధీ



# అపరాజితా దేవి.. విజయం తథ్యం!

చెడుపై మంచి సాధించిన గెలుపే విజయ దశమి. రాక్షస సంహారానికి ప్రతీక దసరా. చెడుపై మంచి గెలిచే తీరుతుందన్న సందేశాన్ని తెలిపే పండుగే విజయదశమి. విజయ దశమి విశిష్టతను తెలిపేలా అనేక పురాణ గాథలు ఉన్నాయి. అందులో ప్రధానమైనదే మహిషాసుర వధ. పూర్వం మహిశాసురుడనే రాక్షసుడు బ్రహ్మదేవుడి కోసం కఠోర తపస్సు చేసి ఏ పురుషుడి చేతిలో తనకు మరణం రాకూడదన్న వరం పొందాడని మన పురాణాలు చెబుతాయి.



ఆ వరం కారణంగా దేవతలు, మానవులను వేధిస్తున్న మహిశాసురుడిని శక్తి స్వరూపిణి అయిన జగన్మాత తొమ్మిది రోజుల పాటు పోరాడి వధించింది. దానికి ప్రతీకగానే దేవీ శరన్నవరాత్రులు నిర్వహించి పదోరోజు విజయదశమి జరుపుకుంటారు. మహిషాసురుడు బ్రహ్మదేవుడి గురించి చాలా సంవత్సరాలు కఠోరమైన తపస్సు చేశాడు. ఏ పురుషుడి చేతిలో కూడా నా ప్రాణం పోకుండా ఉండాలనే వరం కోరుకుంటాడు. దేవతలు, మనుషులను హింసించడం ప్రారంభిస్తాడు. దేవతలు అంతా కూడా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను మహిశాసురుడి నుంచి రక్షించాలని వేడుకుంటారు. వరం ఇచ్చిన బ్రహ్మదేవుడే విరుగుడు చెప్పారు. మహిశారుడిని చంపే శక్తిని సృష్టిద్దామని అంటారు. అమ్మవారిని పూజించి దేవతలందరి శక్తిని కూడా ఒకే దగ్గర చేర్చి ఒక స్త్రీ రూపంలో మహిషాసురమర్ధిని సృష్టించారు. ఆ అమ్మవారు తొమ్మిది రోజులు మహిశాసురుడితో యుద్ధం చేసి ప్రపంచాన్ని రక్షించింది. విజయదశమి రోజు నాడే రాముడు రావణుడిని జయించాడనే కథ ప్రాచుర్యంలో ఉంది. అలా చెడుపై మంచి గెలిచిన ఈ రోజునే విజయదశమిగా ప్రాశస్త్యం పొందింది. అందుకే పలు ప్రాంతాల్లో దసరా రోజు రావణుడి బొమ్మను కాల్చుతుంటారు. ఇక ఈ రోజు జమ్మి చెట్టుని పూజించటం కూడా చూస్తుంటాం. పాండవులు అరణ్యవాసానికి వెళ్లెప్పుడు జమ్మి చెట్టుపై ఆయుధాలు ఉంచారని తిరిగి ఈ విజయదశమి రోజునే వచ్చి ఆయుధాలను తీసుకుని కౌరవులపై విజయం సాధించారని కూడా పురాణాలు చెబుతాయి. అలా విజయదశమి రోజున జమ్మిని పూజించటం ఆనవాయితీగా వస్తోంది. జమ్మి రూపంలోని అపరాజితా దేవిని పూజిస్తే తనను నమ్మిన వారికి విజయం వరించేలా దీవిస్తుందని భక్తుల విశ్వాసం. చెడుపై మంచి సాధించిన విజయంగా చెప్పే విజయదశమి రోజున ఏ పని ప్రారంభించిన అంతా విజయమే అవుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ముఖ్యంగా వ్యాపారులు ఈ రోజున ప్రత్యేకంగా పూజలు నిర్వహిస్తారు. కొత్తగా వాహనాలు కొనాలనునేవారు దసరా రోజున కొనుగోళ్లు చేస్తుంటారు. విజయదశమి రోజున జమ్మి ఆకును పెద్దలకు ఇచ్చి ఆశీర్వాదం పొందితే ఏడాదంతా శుభం జరుగుతుందని ప్రజల విశ్వాసం.

- విద్యారాణి పూరడి

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.